

- బదిలీ చేయించేందుకు యత్నాలు
- త్వరలో తప్పదంటూ ముమ్మర ప్రచారం

అడ్డంగా.. తలూపలేదని..



అధికార పార్టీ నాయకుల మాట వినలేదంటే ఎంతటి అధికారైనా వెళ్లిపోవాల్సిందే. వైసీపీ నాయకులు చెప్పిన దానికి తలూపితే ఓకే.. లేదంటే మూటాముల్లె సర్దుకోవాల్సిందే. అలాంటి పరిస్థితి పురం మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్‌కు ఏర్పడింది. వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఇక్బాల్ ఉన్న సమయంలో కమిషనర్ వచ్చారు. ఈ నేపథ్యంలో ఆ అధికారిపై ప్రస్తుత సమన్వయకర్త వర్గం గుర్రుగా ఉంటోంది. సమన్వయకర్త ప్రస్తుత కార్యాలయ అనుమతుల జారీకి ఆ అధికారి కొంత అలసత్వం వహించారని ఆ వర్గం భావిస్తోంది. దీంతో ఆయనపై సమన్వయకర్త ఆగ్రహిస్తూ వస్తున్నారు. ఈ పరిస్థితుల్లో తాము చెప్పిన దానికి తలూపలేదంటూ బదిలీ చేయించే ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు తెలిసింది. ఈనెల 23 తరువాత ఆ అధికారిని బదిలీ చేస్తారన్న ప్రచారం ఊపందుకుంది.

- హిందూపురం

హిందూపురంలోని పరిగి బస్టాండులో హోల్‌సేల్ కూరగాయల వ్యాపారుల కోసం రేకుల షెడ్లు నిర్మించారు. నిబంధనల ప్రకారం వీటిని కేటాయించడానికి బహిరంగ వేలం వేయాల్సి ఉంది. అలా వేస్తే అక్కడ అధికార పార్టీకి చెందిన అనుయాయిలకు షెడ్లు దక్కే అవకాశం లేదు. దీంతో నెలక్రితం మున్సిపల్ ఛైర్‌పర్సన్, కమిషనర్‌కు సమాచారం లేకుండా అక్కడ రేకుల షెడ్లను వైసీపీ సమన్వయకర్త దీపిక భర్త వేణురెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ ప్రారంభించారు. వేలం లేకుండా మున్సిపాలిటీకి చెందిన షెడ్లను ఎలా అప్పనంగా అప్పగిస్తారన్న విమర్శలు వెల్లువెత్తాయి. ఈ వ్యవహారంలో రూ.లక్షల్లో చేతులు మారాయన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. చేసేదిలేక అప్పట్లో మిన్నకుండిపోయారు. ఎవరైనా కోర్టుకు వెళితే తన మెడకు చుట్టుకుంటుందని మున్సిపల్ కమిషనర్ భావించారు. దీంతో వేలం నిర్వహణకు పత్రికా ప్రకటన ఇచ్చారు. బహిరంగ వేలంలో ఎవరూ పాల్గొనలేదు. వచ్చేవారిని అధికార పార్టీ నాయకులు అడ్డుకున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో దరఖాస్తు చేసుకున్నవారి పేర్లే ఓకే చేయాలంటూ అధికారులపై ఒత్తిడి తెచ్చారని తెలిసింది. అయినా మరోసారి వేలం వేస్తామని వాయిదా వేయడంతో అధికార పార్టీలోని ఓ వర్గం రగిలిపోయింది. దీంతో ఎలాగైనా వేలం లేకుండా చూడాలంటూ కొంతమంది కౌన్సిలర్లు.. వైసీపీ ముఖ్య నేతల వద్ద మొరపెట్టుకున్నారు.

వేలం వేయాలన్నందుకు..

పురం మున్సిపల్ కమిషనర్‌పై వైసీపీ నేతల గుర్రు



మున్సిపల్ కమిషనరే టార్గెట్

ప్రస్తుత మున్సిపల్ కమిషనర్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి పాలకవర్గంలోని అధికార పార్టీకి చెందిన ఓ వర్గం నాయకులు వ్యతిరేకిస్తూ వస్తున్నారు. ఇటీవల మరికొంత మంది కూడా గొంతు కలిపారు. గతనెల మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి కమిషనర్.. మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నుంచి ఆలస్యంగా హాజరయ్యారు. అధికార పార్టీ కౌన్సిల్ సభ్యులు.. కమిషనర్‌ను టార్గెట్ చేస్తూ విమర్శలు చేసి వెళ్లిపోయారు. కమిషనర్ కొంతమందికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు మరికొంతమంది సభ్యులు వాపోతున్నారు. ఏ పని కావాలన్నా సదరు అధికారి వద్దకు వెళ్తే ఇన్‌చార్జిని కలవాలంటూ సలహా ఇస్తారట. ఇటీవల ఆ వర్గానికి సదరు అధికారి ప్రాధాన్యత ఇస్తున్నా.. కొంతమంది చెప్పిన పనులు చేయలేదని బదిలీ చేయించేందుకు యత్నిస్తున్నట్లు సమాచారం. సదరు అధికారి వారితో సర్దుబాటు చేసుకుంటారా.. ఇక్కడి నుంచి వెళ్లిపోవడానికి సిద్ధమవుతారా అన్నది వేచి చూడాలి. ఆయన బదిలీ అవుతారనే ప్రచారం మాత్రం ఉధృతంగా సాగుతోంది.

పోలీసు కేసు పెట్టినందుకా..?





ఇటీవల హిందూపురం పట్టణంలో పలు ఇళ్ల యజమానులకు తెలియకుండానే కొంత మంది మున్సిపల్ సిబ్బంది, అధికార పార్టీ నాయకులు కలిసి పేర్లు మార్చేశారు. ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. దీనిపై లోతుగా విచారించాలని సదరు మున్సిపల్ ముఖ్య అధికారి.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసు లోతుగా విచారిస్తే అధికార పార్టీకి చెందిన కీలక నేతల మెడకు చుట్టుకునే అవకాశం ఉంది. ఎలాగైనా కేసు ఉపసంహరించుకోవాలని సదరు అధికారిని కోరారు. ఆయన ససేమిరా అనడంతో వైసీపీ ముఖ్య నేతలను తెలిపారు. ఇటీవల హిందూపురం వచ్చిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి మున్సిపల్ అధికారిపై ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఎలాగైనా ఆయనను బదిలీ చేయాలని పట్టుబట్టారు. ఈ నేపథ్యలో బదిలీ చేయించేందుకు ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలిసింది.

ఉత్త పోస్టే..!

అధికారాలు ఏవీ?

అసంతృప్తితో ఎంఈఓ-2లు
నాన్ అకడమిక్ పనుల అప్పగింతపై అసహనం
సమాన అధికారాలు కల్పించాలని సంఘాల డిమాండ్



ధర్మవరం: ఉద్యోగోన్నతులు ఇచ్చారు కానీ తమకు ఎలాంటి అధికారాలు ఇవ్వలేదని పలువురు ఎంఈఓ-2లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల విడుదల చేసిన జాబ్‌చార్ట్‌పై వారు పెదవి విరుస్తున్నారు. మండలంలో పని చేసే ఇద్దరు ఎంఈఓలకు సమాన అధికారాలు కల్పించాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ విద్యాసంవత్సరం ఆరంభానికి ముందే మండలానికి ఒక విద్యాశాఖాధికారిని కేటాయించారు. శ్రీసత్యసాయి జిల్లాలో 26 మంది ఉన్నత పాఠశాల సీనియర్ ప్రధానోపాధ్యాయులకు ఎంఈఓ-2గా ఉద్యోగోన్నతులు కల్పించారు. అయితే వీరికి ఎలాంటి అధికారులు ఇవ్వాలనే విషయంలో రాష్ట్ర ఉన్నతాధికారులు ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. గత ఏడాది అక్టోబరు నెలలో రాష్ట్ర ప్రభుత్వం మండల విద్యాశాఖ అధికారి-1, మండల విద్యాశాఖ అధికారి-2లకు సంబంధించి అధికారాల విభజనపై ఉత్తర్వులను జారీ చేసింది. వీటి ప్రకారం మండల విద్యాశాఖ అధికారి-1 పాఠశాల పర్యవేక్షణతో పాటు ప్రైవేటు పాఠశాలల గుర్తింపు, ఉపాధ్యాయులకు సంబంధించిన జీతాల చెల్లింపు ఇతర అంశాలు పర్యవేక్షిస్తారు. ఎంఈఓ-2లకు నాడు-నేడు పనులు, చైల్డ్‌ఇన్ఫో, అమ్మఒడి ఇతర అంశాలకు సంబంధించి పనులను అప్పగిస్తూ ఉత్తర్వులను జారీచేశారు. ఈ ఉత్తర్వుల పట్ల అనేక మంది ఎంఈఓ-2లు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. అనేక సంవత్సరాల పాటు అకడమిక్‌లో పని చేసిన తమకు ఇప్పుడు నాన్ అకడమిక్ పనులను మాత్రమే అప్పగించడం సమంజసం కాదని మండిపడుతున్నారు. ఇద్దరు మండల విద్యాశాఖాధికారులకు అధికారాల విభజనలో ఉపాధ్యాయ సంఘాలు, విద్యావేత్తల నుంచి అభిప్రాయాలు తీసుకోకుండానే ఉత్తర్వులను జారీ చేయడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు తాము మండల విద్యాశాఖ అధికారులుగా కొనసాగే కంటే పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా కొనసాగితేనే బావుంటుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. తమకు ఎంఈఓ-1తో సమానంగా అధికారాలు కల్పించాలని ప్రభుత్వానికి విన్నవిస్తామని, ఒక వేళ ప్రభుత్వం స్పందించకపోతే సమ్మె గురించి యోచిస్తామని పలువురు ఎంఈ-2లు పేర్కొంటున్నారు.

సగం పాఠశాలలు ఎంఈఓ-2లకు అప్పగించాలి



మండలంలోని పాఠశాలల్లో సగం మొదటి మండల విద్యాశాఖ అధికారికి మిగిలిన సగం ఎంఈఓ-2లు పర్యవేక్షించేందుకు అధికారం ఇవ్వాలి. ఇద్దరికీ సమాన అధికారాలు కల్పిస్తేనే ఈ పోస్టులకు న్యాయం జరుగుతుంది.

- రవీంద్రారెడ్డి, ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి

ఎంఈఓ-2 కేవలం నామమాత్ర పోస్టు



రాష్ట్ర ప్రభుత్వం మండల విద్యాశాఖ అధికారుల పని విభజనలో ఏకపక్షంగా వ్యవహరించింది. ఎంఈఓ-2 పోస్టును ఏర్పాటు చేసినా ఎలాంటి అధికారాలను కట్టబెట్టకపోవడం దుర్మార్గం. నామమాత్రంగానే ఈ పోస్టులో ఎంఈఓ-2లు పనిచేయాల్సి ఉంటుంది. ఇద్దరి ఎంఈఓలకు సమాన అధికారాలు ఇవ్వాలి.

-శివ, యూటీఎఫ్ జిల్లా కార్యవర్గసభ్యుడు

ఐసీడీఎస్ కార్యాలయానికి తాళం

అంగన్‌వాడీల సమ్మె ఉధృతం

పెనుకొండ, జనవరి20: తమ సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీలు సాగిస్తున్న సమ్మె 40వ రోజు శనివారం జిల్లా వ్యాప్తంగా కొనసాగింది. సీఐటీయూ నాయకులు అంగన్‌వాడీ కార్యకర్తలు పెనుకొండ సీడీపీఓ కార్యాలయానికి వెళ్లి సిబ్బందిని నిర్బంధించి కార్యాలయానికి తాళాలువేసి ఆందోళన చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ సీడీపీఓ శాంతలక్ష్మి నియంతలా వ్యవహరిస్తోందని కార్యకర్తల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, ఆమె నిర్లక్ష్య ధోరణి నశించాలని నినాదాలు చేశారు. ఆమె కార్యాలయానికి వచ్చేవరకు తలుపులు తీయమని ఆందోళన చేపట్టారు. పోలీసులు అక్కడికి చేరుకుని తాళాలు తీయడానికి ప్రయత్నించగా నాయకులు అడ్డుకున్నారు. సాయంత్రం 6 గంటలైనా తలుపులు తీయకుండా కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న పీడీ తాను పెనుకొండకు వస్తున్నానని తలుపులు తీయాలని నాయకులకు ఫోన్‌లో చెప్పగా వారు నిరాకరిస్తూ.. మీరు వచ్చాకే తలుపులు తీస్తామన్నారు. ఐసీడీఎస్ కార్యాలయం సిబ్బందిని కార్యాలయంలోనే నిర్బంధించడంతో వారు భోజనాలు లేక తీవ్ర ఇబ్బంది పడ్డారు. చివరకు పీడీ అక్కడకు చేరుకుని ఆందోళనకారులతో చర్చలు జరిపి సిబ్బందిని విడిపించారు.



కార్యాలయంలో నిర్బంధంలో ఉన్న ఉద్యోగులు



ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు

- ప్రభుత్వ పథకం కావాలంటే లంచం ఇవ్వాల్సిందే
- భిక్షమెత్తుకునే వారిని సైతం వదలని వైనం
- సచివాలయంలో రెచ్చిపోతున్న వెల్ఫేర్ అసిస్టెంట్
- అధికారులకు ఫిర్యాదు చేసినా, చర్యలు శూన్యం



లంచావతారం!



మేకలచెరువు సచివాలయం

నంబులపూలకుంట, జనవరి 20: మండలంలోని ఓ పంచాయతీ వెల్ఫేర్ అసిస్టెంట్ లంచావతారం ఎత్తాడు. డబ్బులివ్వందే ఏపనీ చేయడని లబ్ధిదారులు వాపోతున్నారు. ప్రభుత్వం ఇచ్చే పింఛన్ తప్ప మరో ఆధారం లేని వృద్ధులు, మంచాన పడిన దివ్యాంగులను సైతం వదిలిపెట్టకుండా వసూళ్లకు పాల్పడుతున్నాడు. పింఛన్‌కు దరఖాస్తు చేసుకునే ముందే ఆయన అడిగినంత డబ్బులిస్తే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. లేకపోతే అంతేనని లబ్ధిదారులు వాపోతున్నారు. పింఛన్ మంజూరు చేయించడానికి ఉన్నతాధికారులతో మాట్లాడుతానని చెప్పి రూ.వెయ్యినుంచి ఐదువేలవరకు వసూలు చేస్తున్నాడని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. మహిళలకు చేయూత, అమ్మఒడి, జగనన్నచేదోడు, జగనన్న తోడు, జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన ఇలా ఏపథకం కావాలన్నా వెల్ఫేర్ అసిస్టెంట్ లాగిన్‌నుంచి ఆన్‌లైన్ చేయాల్సి ఉంది. దీన్ని ఆసరా చేసుకుని గ్రామం నుంచి వలస వెళ్లిన వారి జాబితాను తయారు చేసుకుని వాళ్లకు పథకాల సమాచారం చేరవేస్తాడు. వారు డబ్బులిచ్చిన తర్వాతనే పథకాలను వర్తింపజేస్తున్నట్లు తెలిసింది. లబ్ధిదారులకు పథకాల సొమ్ము అందిన వెంటనే వారి వద్దకు పోయి తాను ఉన్నతాధికారులతో మాట్లాడటం వల్లే మీకు డబ్బు వచ్చింది కాబట్టి తనకు కొంత ఇవ్వాలని డిమాండ్ చేసి తీసుకుంటున్నట్లు సమాచారం. ఈ వెల్ఫేర్ అసిస్టెంట్ అవినీతిపై పలువురు గ్రామస్థులు ఎంపీడీఓ కార్యాలయాలనికి వెళ్లి ఫిర్యాదు కూడా చేశారు. అయినా చర్యలు శూన్యం.

మా అమ్మ పింఛన్‌కోసం రూ.రెండువేలు ఇచ్చా



మా నాన్న వెంకటస్వామి ఎనిమిది నెలల కిందట మృతిచెందారు. మా అమ్మకు వితంతు పింఛన్ కోసం సచివాలయం చుట్టూ తిరిగినా ఫలితంలేదు. చివరకు వెల్ఫేర్ అసిస్టెంట్‌కు రూ. రెండువేలు ఇవ్వడంతో మా అమ్మకు జనవరిలో కొత్త పింఛన్ మంజూరైంది.

- ప్రకాష్, మేకలచెరువు

భిక్షమెత్తి లంచమిచ్చా



నేను కేరళలో భిక్షాటన చేసి, జీవనం సాగిస్తున్నా. నాకు 45 ఏళ్లు పైబడటంతో ప్రభుత్వం అందిస్తున్న చేయూత సాయం మంజూరైంది. దీన్ని తీసుకోవడానికి వెల్ఫేర్ అసిస్టెంట్‌కు రూ.ఐదువందలు చెల్లించా. ఇది భిక్షాటన ద్వారా వచ్చిన డబ్బు. - మంగమ్మ, మేకలచెరువు

పింఛన్ కోసం రూ.ఐదువేలు ఇచ్చా



మా బిడ్డ దివ్యాంగురాలు. పింఛన్‌కోసం దరఖాస్తు చేసుకుని కార్యాలయం చుట్టూ పలుమార్లు తిరిగినా మంజూరు కాలేదు. నెలంతా కూలి పనులకెళ్లి సంపాదించిన మొత్తం రూ.ఐదు వేలు వెల్ఫేర్ అసిస్టెంట్‌కు ఇచ్చా. తరువాత పింఛన్ మంజూరు చేశారు.

- బయ్యప్ప, మేకలచెరువు

నా దృష్టికి వచ్చింది: జహీర్, కార్యదర్శి, మేకలచెరువు

డబ్బుల తీసుకున్న విషయం నా దృష్టికి వచ్చింది. గ్రామంలో సంక్షేమపథకాలతో పాటు పింఛన్ మంజూరుకు వెల్ఫేర్ అసిస్టెంట్ లంచం తీసుకున్నట్లు లబ్ధిదారులు నాకు ఫిర్యాదు చేశారు. ఈవిషయాన్ని ఎంపీడీఓ దృష్టికి తీసుకెళ్లా.



ఎంపీడీఓ కార్యాలయంలో పింఛన్ పంపిణీచేస్తున్న అధికారులు(ఫైల్)

- కాగా తాము కులగణన సర్వేలో ఉన్నామని, త్వరలోనే విచారణ చేపడతామని ఎంపీడీఓ ఆదినారాయణ తెలిపారు.



జయహో బీసీ అంటున్న నాయకులు

జయహో బీసీలో టీడీపీ నాయకులు
193 చెరువులకు నీరు పేరుతో ఎమ్మెల్యే మోసం
మాజీ మంత్రి పల్లె

బీసీల ద్రోహి జగన్

పుట్టపర్తి, జనవరి 20: బీసీల ద్రోహి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి విమర్శించారు. మండలంలో శనివారం జయహో బీసీ కార్యక్రమం సందర్భంగా బైక్‌ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ కర్నాటక నాగేపల్లిలో ప్రారంభమై వెంగళమ్మచెరువు, బొంతపల్లి, గంగిరెడ్డిపల్లి, పెడబల్లి, కొట్లపల్లి, పైపల్లి, కప్పలబండ, ప్రశాంతి గ్రామం, బ్రాహ్మణపల్లి మీదుగా జిల్లా కేంద్రానికి చేరుకుంది. అనంతరం స్థానిక టీడీపీ కార్యాలయంలో బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు కుట్టిమద్ది రంగయ్య అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లె మాట్లాడుతూ బీసీలకు పెద్దపీట వేసింది టీడీపీనే అన్నారు. ఎన్టీరామారావు బడుగు, బలహీనవర్గాలు, ఎస్సీ, ఎస్టీలకు రాజకీయ ప్రాధాన్యం ఇచ్చారన్నారు. బీసీలకు ఎక్కువ పదవులిచ్చి, ఆర్థిక సామాజికాభివృద్ధి చెందేలా చంద్రబాబు కృషి చేశారన్నారు. ప్రస్తుత సీఎం వైఎస్ జగన్ బీసీలపై అక్రమ కేసులు బనాయించి, జైలులో పెట్టి వేధించి, ద్రోహిగా మారారన్నారు. చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రం అన్నివిధాల అభివృద్ధి చెందుతుందన్నారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పదవీకాలం ముగుస్తున్న సమయంలో ప్రజలను మభ్య పెట్టడానికి 193 చెరువులకు ఏడాదిలో నీరు తెస్తానని పాదయాత్ర చేయడాన్ని ప్రజలు నమ్మె పరిస్థితిలో లేరని చెప్పారు. తాను పార్టీ మారుతానని సోషల్ మీడియాలో అసత్య ప్రచారం సాగుతోందన్నారు. ఎప్పటికి పార్టీ మారనని, తుది శ్వాస వరకు టీడీపీలోనే కొనసాగుతానన్నారు.

కలిసికట్టుగా లేనందుకే ఓటమి..

బీసీలందరూ కలిసికట్టుగా లేకపోవడంతోనే ఓడిపోయాం. టీడీపీ గెలిపించుకుంటేనే మన బీసీలకు అభివృద్ధి. ఎవరికి ఏకష్టమొచ్చినా ఆదుకునే పల్లెను గెలిపించాల్సిన బాధ్యత మనపైనే ఉంది. బీసీ కార్పొరేషన్లకు నిధులివ్వకుండా సీఎం జగన్ నిర్వీర్యం చేశాడు. అదే టీడీపీ పాలనలో బీసీల కోసం రూ.32వేల కోట్లు ఖర్చు చేశాం. బీసీ కులాల్లో లక్షల మంది ఉంటే వారిలో కొద్దిమందికి మాత్రమే నిధులు ఖర్చు చేసి మిగిలినవాటిని పక్కదారి పట్టించారు.



- అంబికా లక్ష్మీనారాయణ

ఆంధ్రప్రదేశ్ అరాచక రాష్ట్రంగా మారింది

రాష్ట్రాన్ని అరాచక ఆంధ్రప్రదేశ్‌గా మార్చిన ఘనుడు జగన్. ఇసుక, డీజిల్, పెట్రోల్, సిమెంటు, కరెంటు, ఇనుము, మద్యం, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెంచి పేదల నడ్డివిరిచిన ప్రభుత్వం వైసీపీదే. టీడీపీ పాలనలోనే బీసీలకు అధిక ప్రాధాన్యం దక్కింది. టీడీపీని అధికారంలోకి తీసుకురావడానికి బీసీలందరూ సైనికుల్లా పనిచేయాలి.

- కుంటిమద్ది రంగయ్య, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు

రాష్ట్రంలో రాక్షస పాలన

రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోంది. దానికి అంతం పలికే సమయం ఆసన్నమైంది. టీడీపీ, జనసేన కలిసికట్టుగా 2024 ఎన్నికల్లో పోరాడుదాం.

- పత్తి చంద్రశేఖర్, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి


తప్పుచేసిన రెడ్లపై చర్యలేవీ?



వైసీపీలో తప్పు చేసిన రెడ్లపై చర్యలు లేవు గానీ బీసీలపై మాత్రం వెంటనే వేటు వేస్తున్నారు. జగన్ తన సామాజిక వర్గానికి చెందిన వారు తప్పు చేసినా వెనుక వేసుకొస్తారు. బీసీలు తప్పచేయకపోయినా వేటు వేసి శిక్షిస్తారు. ఉమ్మడి జిల్లాలో శంకరనారాయణ, గోరంట్ల మాధవ్, ఎంపీ రంగయ్యపై తప్పు చేశారని వేటువేస్తూ నియోజకవర్గాలు మార్చారు. బీసీలకు అధిక ప్రాధాన్యం ఇచ్చిన ఘనత చంద్రబాబుకే దక్కుతుంది. జనాభాలో 50 శాతమున్న బీసీలకు 50శాతం నిధులు ఏవీ?

- మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప

16,800 మంది బీసీలు పదవులు కోల్పోయారు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ 33శాతం ఉండగా అందులో 13 శాతం తగ్గించి గొంతుకోశాడు. దీంతో 16,800 మంది పదవులు కోల్పోయారు. 56 బీసీ కార్పొరేషన్లకు నయాపైసా ఇవ్వకుండా నిర్వీర్యం చేశాడు. జే ట్యాక్స్ పేరుతో ఇసుక, మట్టి, రాయి దోపిడీ చేశాడు.

- తిప్పేస్వామి, మాజీ ఎమ్మెల్సీ

తుది ఓటరుజాబితాపై సమీక్ష



సమీక్షలో పాల్గొన్న ఓటరు జాబితా జిల్లా ప్రత్యేక పరిశీలకులు మురళీధర్‌రెడ్డి

పుట్టపర్తి, జనవరి 20: తుది ఓటరు జాబితాపై జిల్లా ప్రత్యేక పరిశీలకులు మురళీధర్‌రెడ్డి శనివారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. తుది ఓటరు జాబితా తయారీ విధానంపై అధికారులతో ఆరా తీశారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు, తప్పులు లేకుండా తుది జాబితా తయారు చేయాలనితి అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో 1561 పోలింగ్ కేంద్రాలున్నాయని, వీటిలో పట్టణాల్లో 367, గ్రామస్థాయిలో 1194 ఏర్పాటు చేశామన్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రానికి సగటున 890మంది ఓటర్లు ఉన్నట్లు వివరించారు. జిల్లాలో దాదాపు 13,91,628మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఇందులో మహిళలు 6,97,119, పురుషులు 6,94,446 మంది, ట్రాన్స్ జెండర్స్ 63మంది ఉన్నట్లు జేసీ వివరించారు. డీఆర్‌ఓ కొండయ్య, ఆర్డీవో భాగ్యరేఖ, రమేష్ రెడ్డి, ఈడీటీ మైనోద్దీన్, ఈఆర్‌ఓలు తదితరులున్నారు.

అయోధ్య రాముడి సంబరాలు



శ్రీరాముడి చిత్రపటం ఊరేగిస్తున్న భక్తులు

పెనుకొండ రూరల్, జనవరి 20: అయోధ్య రామాలయంలో ఈనెల 22న బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని మండలంలోని భక్తులు ఘనంగా సంబరాలు నిర్వహించారు. మండలం లోని కోనాపురం ఆంజనేయస్వామి దేవాలయంలో వేద పండితులు విశ్వనాథ్ ఆధ్వర్యంలో స్వామివారికి పూజలు చేశారు. అనంతరం శ్రీరాముడి చిత్రపటాన్ని ప్రత్యేక పూలతో అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. ఇంటింటికి అయోధ్య రాముడి అక్షింతలు పంపిణీ చేశారు. కార్య క్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నారాయణప్ప, రత్నయ్య, శ్రీనివాసులు, హనుమంత రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

వైసీపీ

కదిరి వైసీపీ కేడర్ కుతకుత.. టీడీపీలోకి వెళ్తున్న నాయకులు

బుజ్జగింపులు ప్రారంభం.. మద్దతు కోరితే మనీ అడుగుతున్న కొందరు

కొత్త ఇన్‌చార్జికి చుక్కలు చూపుతున్న వైనం

పరిస్థితిని చక్కదిద్దేందుకు మంత్రి పెద్దిరెడ్డి యత్నం



టీడీపీలోకి చేరిన వాల్మీకి పవన్(ఫైల్)

కదిరి, జనవరి 20: పార్టీ, ప్రభుత్వ విధానాలతో విసిగిపోయిన పలువురు నాయకులు టీడీపీలోకి వలసలు వెళ్తున్నారు. దీన్ని ఆపడానికి వైసీపీ అధిష్టానం సామ, దాన, భేద, దండోపాయాలు మొదలు పెట్టినట్లు సమాచారం. ఈక్రమంలోనే శనివారం కదిరిలో పర్యటించిన మంత్రి పెద్దిరెడ్డి వైసీపీ నాయకులు వెంకటరమణారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కడపల మోహన్‌రెడ్డితో చర్చించారు. అయితే స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పీవీ.సిద్ధారెడ్డి మాత్రం మంత్రిని కలవకుండా ముఖం చాటేసినట్లు తెలిసింది. శనివారం మధ్యాహ్నం వరకు పట్టణంలో ఉన్నా మంత్రిని కలవకుండా సొంత పనుందంటూ బయటకు వెళ్లినట్లు సమాచారం.

టీడీపీలోకి పెరిగిన వలసలు

గత రెండు నెలల నుంచి నియోజకవర్గంలోని అన్ని మండలాలనుంచి వలసలు మొదలయ్యాయి. వైసీపీ తలుపుల మండల కన్వీనర్ శంకర్ గతంలోనే టీడీపీలో చేరగా, తాజాగా పవన్‌కుమార్‌రెడ్డి సైకిల్ ఎక్కారు. ఆయనతోపాటు 14వ వార్డు ఇండిపెండెంట్ కౌన్సిలర్ మహబూబ్‌బాషా, మాజీ మార్కెట్‌యార్డు ఛైర్మన్ గరికిపల్లి రామక్రిష్ణారెడ్డి, రెండురోజులక్రితం టీడీపీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో టీడీపీలో చేరారు. ప్రతిరోజు నియోజకవర్గంలో ఏదో ఒక మండలం నుంచి కుటుంబాలతో కలిసి టీడీపీలో చేరుతున్నారు. మరికొంతమంది ముఖ్య నాయకులు కూడా టీడీపీలో చేరడానికి సిద్ధంగా ఉన్నట్లు సమాచారం.

నష్ట నివారణ కోసం వైసీపీ యత్నం

నియోజకవర్గంలో టీడీపీలోకి పెరిగిన వలసలు చూసి, వైసీపీ నష్టనివారణ చర్యలు చేపట్టినట్లు సమాచారం. ఈక్రమంలో ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ పేరుతో కొంతమంది నాయకులను తాడేపల్లికి పిలిపించినట్లు తెలిసింది. వైసీపీ రాష్ట్ర సమన్వయకర్త బత్తల హరిప్రసాద్, మైనార్టీ నాయకుడు ఇస్మాయిల్ గత మూడురోజులనుంచి ముఖ్యమంత్రిని కలవడం కోసం అక్కడే ఉన్నట్లు అనుచరులు చెబుతున్నారు. బత్తల హరిప్రసాద్ తల్లిదండ్రులతో టీడీపీ నాయకులు ఇప్పటికే చర్చలు జరిపారు. పార్టీని వీడేది ఖాయమంటూ ప్రచారాలుకూడా జరుగుతున్నాయి. బీసీ నాయకులు చేజారిపోకుండా ఎంపీ మిథున్‌రెడ్డి ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు సమాచారం. మైనార్టీ నాయకుడు ఎస్‌ఎండీ ఇస్మాయిల్‌ను కూడా బుజ్జగించడానికి పిలిపించినట్లు సమాచారం. మైనార్టీ సీనియర్ నాయకుడిగా, వైసీపీ ఆవిర్భావం నుంచి పనిచేస్తున్న ఆయన ఎమ్మెల్యే టిక్కెట్‌ను ఆశిస్తున్నారు. గత రెండు ఎన్నికల్లో ఆయనకు వైసీపీ అధిష్టానం మొండిచేయి చూపింది. ఈఎన్నికల్లో అయినా టిక్కెటు దక్కుతుందన్న ఆయన ఆశలు అడియాశలయ్యాయి. ఆయనను కాదని, మక్బూల్ బాషాను ఇన్‌చార్జిగా నియమించారు. దీంతో బాహాటంగానే ఆయన తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. మొత్తం మీద వైసీపీ అధిష్టానం తమ పార్టీ నాయకులు చేజారిపోకుండా బుజ్జగింపులు మొదలు పెట్టినట్లు తెలుస్తోంది.



మాజీ ఎమ్మెల్యే కడపల మోహన్‌రెడ్డితో చర్చిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పైసలిస్తేనే మద్దతు !

ఇటీవల కదిరి నియోజకవర్గానికి వైసీపీ ఇన్‌చార్జిగా మక్బూల్ బాషాను నియమించారు. ఆయనకు ఎమ్మెల్యే సిద్దారెడ్డి మద్దతుదారులు పూర్తిగా సహకరించలేదని సమాచారం. వారిలో కొంతమందిని మద్దతు కోసం కలిసినప్పుడు తాము ఖర్చులు పెట్టామని, ఆ డబ్బులివ్వాలని అడుగుతున్నట్లు తెలిసింది. తలుపుల మండలంలోని ఓ నాయకుడు ఏకంగా రూ.రెండుకోట్లు ఇవ్వాలని కోరినట్లు సమాచారం. దీంతో ఆయన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డివద్ద ఈ విషయాన్ని ఏకరువు పెట్టినట్లు తెలిసింది. మొత్తం మీద కొత్తగా వచ్చిన ఇన్‌చార్జికి స్థానిక నాయకులు చుక్కలు చూపుతున్నట్లు తెలిసింది. ఈ ఇబ్బందులు తట్టుకోలేక నాకు ఈరాజకీయమే వద్దు అన్నట్లు సమాచారం. అయితే మంత్రి ధైర్యం చెప్పి, తాను పర్యటించి అన్ని సర్దుకునేలా చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిసింది.

దండోపాయాలతో అయినా దారికి తెచ్చుకోవాలని..

ఎమ్మెల్యే వర్గీయులు కొత్త ఇన్‌చార్జికి సహకరించకపోవడంతో వారిని సామ, దాన, దండోపాయలతో అయినా దారికి తెచ్చుకోవాలని అధిష్టానం చూస్తున్నట్లు సమాచారం. అందులో భాగంగానే ఇటీవల వైసీపీ నాయకుడు రమేష్‌రెడ్డి, వెంకటరమణారెడ్డికి సంబంధించిన ఫ్యాక్టరీల్లో తనిఖీలు చేయించారు. అలాగే ఇటీవల టీడీపీలోకి చేరిన వాల్మీకి పవన్‌కుమార్‌రెడ్డి పాఠశాలపైన విద్యాశాఖాధికారులచే దాడులు చేయించినట్లు చెబుతున్నారు. ఆర్థికంగా బలంగా ఉన్నవారిపై అధికారాన్ని ఉపయోగించి దారికి తెచ్చుకోవాలని ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. కొంతమంది కౌన్సిలర్లపై కూడా ఇదేరకమైన ప్రయోగం చేస్తున్నట్లు సమాచారం.

మంత్రికి ముఖం చాటేసిన ఎమ్మెల్యే

మంత్రిపెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కదిరికి వస్తున్నారని, ఇంటికొచ్చికలుస్తారని, మంత్రి స్థానిక ఎమ్మెల్యే సిద్దారెడ్డికి సమాచారం పంపినట్లు తెలిసింది. తాను ఉండటం లేదని, సొంత పనిమీద బయటకు వెళ్తున్నట్లు మంత్రికి ఎమ్మెల్యే తిరిగి సమాచారం పంపినట్లు తెలిసింది. మొత్తం మీద మంత్రిని కలవకుండా ముఖం చాటేసినట్లు సమాచారం.

తాడేపల్లిలో తనయుడు, కదిరిలో తండ్రి

వైసీపీలో కదిరి ఇన్‌చార్జి మార్పు తరువాత చోటుచేసుకున్న పరిణామాలను సరిచేయడానికి మంత్రి పెద్దిరెడ్డి కదిరిలో కొంతమంది నాయకులను, ఆయన తనయుడు ఎంపీ మిథున్‌రెడ్డి తాడేపల్లిలో కొంతమంది నాయకులను బుజ్జగిస్తున్నట్లు సమాచారం. మంత్రి పెద్దిరెడ్డి శనివారం వైసీపీ నాయకులు, కాంట్రాక్టర్లు అయినా వెంకటరమణారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డిలను కలిశారు. పార్టీకి పనిచేయాలని కోరారు. అయితే తమ ఫ్యాక్టరీపై జరిగిన రైడ్‌ల గురించి మంత్రిని నిలదీసినట్లు సమాచారం. పలు వాదనల అనంతరం మంత్రి మాట్లాడుతూ మనస్సులో ఏమీ ఉంచుకోకుండా కలిసి పనిచేయాలని కోరినట్లు తెలిసింది. అలాగే మాజీ ఎమ్మెల్యే కడపల మోహన్‌రెడ్డిని కూడా ఆయన నివాసంలో కలిసి, పార్టీకి పనిచేయాలని కోరినట్లు సమాచారం.



మార్కెట్‌కు వచ్చిన చీనీ కాయలు

చీనీ మార్కెట్ ప్రారంభం

అనంతపురం రూరల్, జనవరి 20: నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో చీనీ మార్కెట్ శనివారం పునః ప్రారంభమైంది. చీనీకాయలు రాకపోవడంతో మూడు నెలలుగా మార్కెట్‌ను బంద్ చేశారు. శనివారం మార్కెట్‌కు నాలుగు టన్నుల చీనీ కాయలు వచ్చాయి. టన్ను గరిష్ఠ ధర రూ.25వేలు, సరాసరి రూ.20వేలు, కనిష్ఠ ధర రూ.16వేలు పలికినట్లు మార్కెట్ యార్డు ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్ ప్రారంభమైందన్న విషయాన్ని రైతులు గమనించాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తాడిపత్రిటౌన్, జనవరి20: పట్టణంలోని శివాలయం రోడ్డు శ్రీ సత్యసాయి సేవా సంస్థలో ఉచితంగా మగ్గం, జర్దోసి శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ సభ్యులు శనివారం తెలిపారు. బ్యాంకర్ల గ్రామీణ, ఔత్సాహికుల అభివృద్ధి సంస్థ హైదరాబాద్ ఆధ్వర్యంలో శిక్షణ జరుగుతుందన్నారు. 10వ తరగతి పాస్ లేదా ఫెయిల్‌తోపాటు 19నుంచి 35సంవత్సరాలలోపు మహిళలకు మాత్రమే శిక్షణ ఉంటుందని, ఆసక్తిగల వారు ఈనెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 40 మందికి 40 రోజుల పాటు శిక్షణ అందజేస్తామన్నారు. వివరాలకు 99129 48080, 9247163799 నెంబర్లను సంప్రదించాలని సభ్యులు కోరారు.

కొనసాగిన పట్టురైతుల సమ్మె

● మద్దతు పలికిన గుండుమల



ర్యాలీలో పాల్గొన్న గుండుమల రైతులు, రీలర్లు

హిందూపురం అర్బన్, జనవరి 20: పట్టణ పరిధిలోని పట్టుగూళ్ళ మార్కెట్ ఎదురుగా పట్టు రైతులు చేపట్టిన సమ్మె శనివారం 4వ రోజుకు చేరింది. నాలుగున్నరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రోత్సాహక ధనం అందించాలని వారు సమ్మెచేట్టిన సంగతి తెలిసిందే. సమ్మెకు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ... కొన్నేళ్లుగా ఇక్కడి వాతావరణ పరిస్థితుల కారణంగా పంటలు సరిగా పండడం లేదని, ఒకవే ళ పండినా గిట్టుబాటు ధరలు లభించక రైతులు విలవిలలాడుతున్నారన్నారు. ఇలాంటి తరుణంలో ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకం అందకపోతే రైతులు జీవనం ఎలా సాగించాలని ప్రశ్నించారు. చంద్రబాబు సీఎంగా ఉన్నపుడు రైతులను ఎంతగానో ఆదుకున్నారని, నారా లోకేశ్ పాదయాత్రలో రైతుల బాధలను దగ్గరగా చూశారన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే ప్రోత్సాహక ధనం అందజేస్తామన్నారు. అధునాతన సదుపాయాలతో పురంలో పట్టుగూళ్ల మార్కెట్‌ను నిర్మిస్తామన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ మాట్లాడుతూ... జగన్ ప్రభుత్వం రైతుల సమస్యల పట్ల పూర్తిగా అశ్రద్ధ వహిస్తోందని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలన్నారు. అనంతరం రైతులు, రీలర్లు ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ స్వర్ణలతకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి బేవనహళ్ళి ఆనంద్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జడ్పీ శ్రీనివాసులు, సాంబశివ, పట్టు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధనాపురం వెంకటరామిరెడ్డి, జిల్లా కార్యదర్శి సిద్దారెడ్డి, సోమశేఖర్, రాజేష్, హనుమంతరెడ్డి, నవీన్, జయరామిరెడ్డి, ఓపీడీఆర్ శ్రీనివాసులు, గంగిరెడ్డి, రీలర్లు ముస్తఫా, అన్సర్, ఖలీల్ పాల్గొన్నారు.

'నవోదయ'కు 4871 మంది విద్యార్థులు హాజరు



అనంతపురం విద్య, జనవరి 20: నవోదయ విద్యాలయ పరీక్షలకు 4,871 మంది విద్యార్థులు హాజరయ్యారు. శనివారం అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో 34 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకూ పరీక్షలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 8,857 మంది విద్యార్థులు హాజరుకావాల్సిఉండగా 4,871 మంది హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను ఏసీ గోవింద్ నాయక్, డిప్యూటీ డీఈఓ శ్రీనివాస్‌రావు తనిఖీ చేశారు.

బంగారు గనులు తెరిపించండి

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి వినతి

రాప్తాడు, జనవరి 20: బంగారు గనులు తెరిపించి, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిని ఆ పార్టీ నాయకులు కోరారు. శనివారం ఉరవకొండలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణకు బెంగళూరు నుంచి అనంతపురం వెళ్తుండగా రాప్తాడులో పురందేశ్వరిని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ గొంది అశోక్, రామగిరి బంగారు గనుల వర్కర్స్ యూనియన్ సభ్యులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ సత్యసాయి జిల్లా రామగిరిలో 1984లో బంగారు గనులు ఏర్పాటు చేసి 300 మంది కార్మికులతో ఉత్పత్తి ప్రారంభించారు. 100 ఏళ్ల నడిచిన కోలార్ గోల్డ్ ఫీల్డ్ బడ్జెట్‌లో రామగిరి కలిపి మొత్తం బీజీయంఎల్‌ని ఏర్పాటు చేశారన్నారు. 1995 సంవత్సరం ఖాయిలా పరిశ్రమగా 2001వ సంవత్సరంలో బీజీఎంఎల్‌ని మూసి వేసి రెట్రెచ్‌మెంట్ పేరుతో కార్మికులను భయపెట్టి 10 ఏళ్ల సర్వీస్ ఉండగానే ఉద్యోగాల నుంచి తొలగించి కార్మికులను వీధిపాలు చేశారన్నారు. కోర్టు తీర్పులను లెక్కచేయకుండా కర్ణాటక హై కోర్టులో టెండర్ దారులు స్క్రాప్ కటింగ్ పర్మిషన్ తెచ్చుకున్నారని, కార్మికులకు బకాయిలు చెల్లించిన తరువాతే స్క్రాప్ కటింగ్ చేయాలని కోరారు. సుప్రీం కోర్టు ఆదేశించినా న్యాయం చేయలేదని వారు వాపోయారు. సమస్యను ప్రదాని మోదీ దృష్టికి తీసుకెళ్లి కార్మికులకు న్యాయం చేయాలన్నారు. నియోజకవర్గ కోకన్వీనర్ కాటమయ్య, వర్కర్స్ ఎంఎస్ శాస్త్ర, నారాయణ, సబ్‌జాన్, తిరుపాలప్ప తదితరులు పాల్గొన్నారు.

మీ వైద్యం సూపర్



● సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో అధునాతన సర్జరీలు ● పేదల ప్రాణాలు కాపాడుతున్న ప్రభుత్వ వైద్యులు

అనంతపురం టౌన్ జనవరి 20 : నగరంలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో వైద్యులు అదునాతన శస్త్ర చికిత్సలు నిర్వహిస్తూ పేదల ప్రాణాలు కాపాడుతున్నారు. ప్రైవేట్ ఆస్పత్రిలో సాధ్యం కాని చికిత్సలను సైతం అందిస్తూ ప్రశంసలు అందుకుంటున్నారు. తాజాగా ముగ్గురు న్యూరో సర్జరీ విభాగం వైద్యులు కార్పోరేట్‌స్థాయి ఆపరేషన్లు చేపట్టి విజయవంతం కావడంతో బాధితులు ఆరోగ్యంగా కోలుకున్నారు. శనివారం ఈముగ్గురినీ డిశ్చార్జ్ చేశారు. వైద్యుల బృందాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావులు అభినందించారు. బాధితుల వివరాలను డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, న్యూరో సర్జరీ విభాగం వైద్యులు భాస్కర్, భాస్కర్‌బాబు, రవితేజ వెల్లడించారు.



బాధితులతో సూపర్‌స్పెషాలిటీ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, వైద్యులు భాస్కర్, భాస్కర్‌బాబు, రవితేజ

● నల్లచెరువు మండలానికి చెందిన 75సంవత్సరాల వెంకటరమణ తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. మాట్లాడలేని పరిస్థితికి వెళ్లడంతో కుటుంబసభ్యులు ఈనెల 9వతేదీన అనంతపురంలోని ఓప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స అసాధ్యమని చెప్పడంతో జిల్లా సర్వజన ఆస్పత్రికి తీసికెళ్లగా వైద్యులు రవితేజ పరిశీలించారు. తలకు గాయం కావడంతో రక్తం గడ్డకట్టిందని వెంటనే ఆపరేషన్ చేయాలన్నారు. కుటుంబ సభ్యుల అంగీకారంతో సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించి అర్థరాత్రి సమయంలోనే ఆపరేషన్ చేశారు. పరిపూర్ణంగా కోలుకోవడంతో శనివారం డిశ్చార్జ్ చేశారు. ఇదే ఆపరేషన్ బయట చేయాలంటే రూ.4లక్షలు ఖర్చు అవుతుందని ఇక్కడ ఉచితంగా చేయడం జరిగిందని న్యూరో సర్జరీ హెచ్ఓడీ డాక్టర్ బాస్కర్ తెలిపారు. ఆపరేషన్ విజయవంతంపై కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

● కళ్యాణదుర్గం మండలం మోరేపల్లికి చెందిన 60సంవత్సరాల మారెక్క అనే వృద్ధురాలికి వెన్నెముక విరిగింది. విపరీతమైన నొప్పి రావడంతో ఈనెల 10న ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఇక్కడ ఎలాంటి ఆపరేషన్ లేకుండా అదునాతనమైన కైపో ప్లాస్టర్ సర్జరీ చేసారు. ఇలాంటి ఆపరేషన్లు పెద్దపెద్ద కార్పోరేట్ ఆస్పత్రులలోనే చేస్తారని అనంతపురంలో ఎవరూ చేయరని న్యూరో వైద్యులు బాస్కర్ వెల్లడించారు. ఆరోగ్యంగా కోలుకోవడంతో డిశ్చార్జ్ చేసారు. చికిత్స ఫలించడంపై కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

● రాప్తాడు మండలం బుక్కచెర్లకు చెందిన 74ఏళ్ల సూర్యాచారి 9నెలల క్రితం ప్రమాదంలో గాయపడ్డారు. మెదడులో రక్తం గడ్డకట్టగా ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. తిరిగి సమస్య రావడంతో ఈనెల 9వతేదీన సూపర్ స్పెషాలిటీలో క్రేనియో ప్లాస్టిక్ సర్జరీ చేశారు. ఇదే ఆపరేషన్‌కు ప్రైవేట్‌గా అయితే రూ.3 లక్షలనుంచి రూ.4 లక్షల వరకు అవుతుందని, ఉచితంగా చికిత్స అందిందని కుటుంబ సభ్యులు వెల్లడించారు.

సూర్యప్రసాద్‌కు ప్రధాని బాల పురస్కార్



కిలిమంజారోపై జాతీయ జెండాతో సూర్యప్రసాద్

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 20: జిల్లా కేంద్రానికి చెందిన రాగే సూర్యప్రసాద్‌కు ప్రధానమంత్రి బాల పురస్కార్ అవార్డు దక్కింది. 9 ఏళ్ల వయసు కలిగిన రాగే సూర్యప్రసాద్ టాంజానియా దేశంలోని కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించినందుకు ఈ అవార్డుకు ఎంపిక చేశారు. అనంత పురంలోని అశోక్‌నగర్‌కు చెందిన రాగే శివప్రసాద్, ప్రమీల దంపతుల కుమారుడైన సూర్యప్రసాద్ కొడిగెనహళ్లి గురుకుల పాఠశాలలో ప్రస్తుతం 5వతరగతి చదువుతున్నాడు. ఓవైపు తైక్వాండో క్రీడలో రాణిస్తూనే మరోవైపు పర్వతారోహణలో శిక్షణ పొందుతున్నాడు. ఈనెల 22న ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో నిర్వహించే అవార్డుల ప్రదానోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డును రాగే సూర్యప్రసాద్ అందుకోనున్నారు. ఈనెల 23న ప్రధాని మోదీతో నిర్వహించే ముఖాముఖిలో పాల్గొననున్నాడు.

తైక్వాండోలో కూడా ఈ బాలుడు జిల్లా, రాష్ట్ర స్థాయిలో సుమారు పదికి పైగా పతకాలు సాధించాడు. 2021లో జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో బంగారు పతకం సాధించాడు.

పలు చోట్ల శిక్షణ, సాధన: పర్వతారోహరణపై ప్రత్యేక శ్రద్ధ పెంచుకున్న సూర్యప్రసాద్ అనేక ప్రాంతాల్లో శిక్షణ పొందుతూ సాధన చేశాడు. నెల్లూరు, కడప జిల్లాల్లో శిక్షణ పొందిన సూర్యప్రసాద్ జమ్మూకాశ్మీర్‌లో లడక్‌లో ట్రైనింగ్ తీసుకున్నాడు. భవిష్యత్తులో ఎవరెస్ట్‌తో పాటు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పలు పర్వతాలను అధిరోహించి రికార్డు సృష్టించాలన్నదే తన లక్ష్యమని సూర్యప్రసాద్ తెలిపాడు.

ఆటో బోల్తా: ఐదుగురికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాజు

గుత్తిరూరల్, జనవరి 20: పట్టణ శివారులోని స్పందన ఫంక్షన్ హాల్ వద్ద 67వ జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు గాయపడ్డారు. గుత్తికి చెందిన ఆదినారాయణ, రాజు, వరలక్ష్మి, నాగరాజు, విజయరామరాజు, విమలమ్మలు వన్నేదొడ్డిలో వారి బంధువుల ఇంటిలో 11 రోజుల దినకార్యము వెళ్లారు. అనంతరం తిరిగి వస్తుండగా గుత్తి పట్టణ శివారులో ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గుర్తించి క్షతగాత్రులను గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం రాజుని అనంతపురానికి తరలించారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.



చికిత్స పొందుతున్న వరలక్ష్మి

అందరి సహకారంతో యూనివర్సిటీని అభివృద్ధి చేస్తా

● బాధ్యతలు స్వీకరించిన జేఎన్‌టీయూ వీసీ శ్రీనివాసరావు

అనంతపురం సెంట్రల్, జనవరి 20: ఉద్యోగులు, సిబ్బంది ఇలా అందరి సహకారంతో వర్సిటీని అభివృద్ధి పథంలో నడిపించేలా ముందుకెళ్తానని జేఎన్‌టీయూ వీసీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం రిజిస్ట్రార్ శశిధర్ ఆధ్వర్యంలో వీసీగా శ్రీనివాస రావు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమ ప్రాంత ప్రజలకు సాంకేతిక విద్యనందిస్తున్న జేఎన్‌టీయూకి వీసీగా రావడం అనందంగావుందన్నారు. అనంతరం రెక్టార్ విజయ కుమార్, పలువురు డైరెక్టర్లు, విభాగాధిపతులు, ప్రొఫెసర్‌లు, ఉద్యోగులు, సిబ్బంది శ్రీనివాసరావుకు శుభాకాంక్షలు తెలియజేశారు.



విభాగాల వారీగా సమీక్ష...

నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వీసీ శ్రీనివాసరావు పరిపాలన భవనంలోని అన్ని విభాగాలను కలియదిరిగి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అ నంతరం విభాగాల వారీగా సమీక్ష నిర్వహించారు. న్యాక్ ర్యాంకింగ్ సాధించేలా కృషిచేయాలని అధికారులకు వీసీ సూచించారు.

జేఎన్‌టీయూ వీసీగా బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాసరావు

జనసేన ఎన్నికల నిర్వహణ కమిటీ నియామకం

● రాయలసీమ జోన్-2 కన్వీనర్‌గా భవానీ రవికుమార్

అనంతపురం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): రాను న్న ఎన్నికలకు జనసేన సమాయత్తమవుతోంది. ఆ పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ హాజరయ్యే సభలు, కార్యక్రమాల నిర్వహణ సజావుగా సాగేందుకుగానూ ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశారు. అందులో భా గంగా రాయలసీమ జిల్లాలను రెండు జోన్‌లుగా విభజించారు. రాయలసీమ జోన్-2గా ఉమ్మడి అనంతపురం, కర్నూలు జిల్లాలుగా ఏర్పాటు చేశారు. జోన్-2 కన్వీనర్‌గా జిల్లాకు చెందిన ఆ పార్టీ కార్యక్రమాల నిర్వహణ రాష్ట్ర ప్రధానకార్యదర్శి భవానీ రవికుమార్‌ను నియమించారు. ఆ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయం నుంచి శనివారం అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి. కో-కన్వీనర్లుగా గల్లా హర్ష, సాకే పవన్‌లు, కమిటీ సభ్యులుగా గౌని ప్రసాద్, వారణాసి నవీన్‌కుమార్, సతీష్‌కుమార్, శంకర్, సాయిసంపత్, సందీప్, మద్దిలేటి, మాబు హుస్సేన్, షబ్బీర్, బోయ గోవిందు, లక్ష్మణ్, లింగారెడ్డి, వెంకటేష్‌లను నియమించారు. అదే విధంగా ఆర్ శ్రీహరి, శ్రీనివాసులును లీగల్ టీంగా ఏర్పాటు చేశారు. డా. జగన్మోహన్, డా. అరవింద్, డా. సంతోష్‌నాయక్, డా. మనోజ్, డా. కృష్ణ చైతన్య, డా. సాయి అనుదీప్‌లను డాక్టర్స్ బృందంలో చోటు కల్పించారు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయంలో వీరితో సన్నాహక సమావేశాన్ని ఆ పార్టీ ముఖ్యులు నిర్వహించనున్నారు.



కిసాన్‌మేళాను వినియోగించుకోండి

● ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ రామసుబ్బయ్య

పుట్టపర్తిరూరల్, జనవరి 20: ప్రతికూల వాతావరణంలో అనువైన పంటలను సాగుచేయడానికి మెలకువలు తెలియజేసేందుకు గాను నిర్వహించే జోనల్‌స్థాయి కిసాన్‌మేళాను ఉమ్మడి జిల్లా రైతులు సద్వినియోగం చేసుకోవాలని పట్టణంలోని ఏరువాకకేంద్రం కోఆర్డినేటర్ రామసుబ్బయ్య సూచించారు. ఏరువాక కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 23వ తేదీన అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండలం రేకులకుంట వ్యవసాయపరిశోధనా కేంద్రంలో జోనల్‌స్థాయి కిసాన్‌మేళా జరగనుందన్నారు. ఇందులో వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు పాల్గొని ప్రతికూల వాతావరణంలో అనువైన పంటలను సాగు చేయడానికి అవసరమైన మెలకువలను తెలియజేస్తామన్నారు. అంతేకాకుండా వ్యవసాయంలో ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన రోబోట్స్, డ్రోన్స్, వ్యవసాయ యంత్రీకరణ, విత్తనాలు, పురుగుమందులు, ఎరువులు, టిష్యూకల్చర్, మొక్కలు, జీవన ఎరువులకు సంబంధించిన స్టాల్స్‌ను ఆయా కంపెనీలు ప్రదర్శిస్తాయని చెప్పారు. భారతీయ నూనెగింజల పరిశోధన సంస్థ హైదరాబాద్, అనంతపురం, కర్నూలు, నంద్యాల, శ్రీసత్యసాయి జిల్లాల ఏరువాక కేంద్రాలు, కృషివిజ్ఞాన కేంద్రాలు, వ్యవసాయ పరిశోధనా స్థానంల శాస్త్రవేత్తలు వివిధ శాఖల అధికారులు పాల్గొనున్నట్లు తెలిపారు. అవకాశాన్ని ఉమ్మడిజిల్లా రైతుల సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సీఎం పర్యటన ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి

● జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ఉరవకొండ,జనవరి20: సీఎం జగన్ ఉరవకొండ పర్యటన ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం సీఎం పర్యటనలో భాగంగా అనంతపురం రోడ్డులోని సభాస్థలి, హెలీప్యాడ్ ఏర్పాటు కోసం డిగ్రీ, జూనియర్ కళాశాల మైదానాలను జిల్లా కలెక్టర్‌తో కలిసి మం త్రి పరిశీలించారు. అనంతరం పట్టణంలో ని తొగటవీర కల్యాణ మండపంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ ఈ నెల 23న ముఖ్యమంత్రి ఉరవకొండలో వైఎ స్సార్ ఆసరా కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ తలశిల రఘురాం, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, జడ్పీసీఈఓ నిదియాదేవి, అడిషనల్ ఎస్పీ విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఆర్డీఓ శ్రీనివాసులు రెడ్డి, డీఆర్‌డీఏ నరసింహారెడ్డి, మెప్మా పీడీ విజయ్‌లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి

పోలీస్ సమస్యలపై ఎస్పీ జూమ్ కాన్ఫరెన్స్

అనంతపురం క్రైం, జనవరి 20: జిల్లా ఎస్పీ అన్బురాజన్ పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారంపై దృష్టి సారించారు. శనివారం జిల్లాలోని సివిల్, ఏఆర్ పోలీస్ సిబ్బంది సమస్యలపై ఎస్పీ జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. విధుల్లో, వ్యక్తిగతంగా సిబ్బంది ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సమస్యలపై ఆరా తీశారు. వివిధ రకాల సమస్యలను ఎస్పీ దృష్టికి తెచ్చారు. ఎస్పీ స్పందించి సిబ్బంది విన్నపాలు, విజ్ఞప్తులను నిబంధనలను అనుసరించి పరిష్కరిస్తామని తెలిపారు. కొన్ని సమస్యలకు అప్పటికప్పుడు పరిష్కరించారు.

పల్లె ఆధ్వర్యంలో భారీగా బైక్‌ర్యాలీ

● వేలాదిగా పాల్గొన్న టీడీపీ శ్రేణులు



పుట్టపర్తిలోని సత్యమ్మ ఆలయం వద్ద బైక్‌ర్యాలీలో పాల్గొన్న పల్లె రఘునాథ రెడ్డి

పుట్టపర్తి రూరల్, జనవరి 20: జయహో బీసీ కార్యక్రమంలో భాగంగా శనివారం మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీ టీడీపీ శ్రేణుల్లో రెట్టింపు ఉత్సాహాన్ని నింపింది. జిల్లాకేంద్రంలోని సత్యమ్మ ఆలయం నుంచి ప్రారంభమైన బైక్‌ర్యాలీ రూరల్ మండలం కర్ణాటకనాగేపల్లి, వెంగళమ్మచెరువు, చెర్లోపల్లి, కంబాలపర్తి, బొంతలపల్లి, సాతార్లపల్లి, గంగిరెడ్డిపల్లి, పెడపల్లి, గువ్వలగుట్టపల్లిక్రాస్, బత్తలపల్లి, కప్పలబండ, మామిళ్లకుంట క్రాస్, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, బ్రాహ్మణపల్లి, ఎమ్మార్వో ఆఫీస్, ఎనుమలపల్లి, గణేష్‌కూడలి మీదుగా సుమారు 55 కిలోమీటర్ల మేర అట్టహాసంగా సాగింది. కార్యక్రమంలో వేలాదిమంది తెలుగుదేశం కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు. అనంతరం వారందరూ స్థానిక టీడీపీ కార్యాలయంలో జరిగే సభకు తరలివెళ్లారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి



కరపత్రాలు పంచుతున్న టీడీపీ నాయకులు

బుక్కపట్నం, జనవరి 20: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని బీసీ కాలనీలో శనివారం ఆయన స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి బాబు ష్యూరిటీ, భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కరపత్రాలు పంచుతూ చంద్రబాబు ప్రకటించిన మినీమేనిఫెస్టో పథకాల గురించి వివరించారు. అనంతరం మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో వెనుకబడిందన్నారు. చంద్రబాబు తిరిగి సీఎం అయితేనే రాష్ట్రం మళ్లీ అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. కావున ప్రతిఒక్కరూ టీడీపీ విజయానికి పాటు పడాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు నాగరాజు, ఈశ్వరయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీలో కష్టపడిన వారికి గుర్తింపు: పల్లె



టీడీపీ నాయకులకు పార్టీ జెండాను అందజేస్తున్న పల్లె

ఓబుళదేవరచెరువు, జనవరి 20: పార్టీ కోసం కష్టపడిన నాయకులకు, కార్యకర్తలకు టీడీపీ గుర్తింపు ఇస్తుందని మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి పేర్కొన్నారు. పుట్టపర్తి టీడీపీ కార్యాలయంలో శనివారం ఆయన సోషల్ మీడియాలో చురుగ్గా పని చేసినందుకు ఓడీసీ మండలానికి చెందిన నియోజకవర్గ మైనార్టీ కార్యదర్శి గండికోట ఇర్షాద్‌కు పార్టీ కేంద్ర కార్యాలయంనుంచి వచ్చిన పార్టీ గుర్తుతో కూడిన జెండాను పల్లె బహూకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి కార్యకర్త, నాయకుడు పార్టీ కోసం కృషి చేసి గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఆర్ఎంపీ జాకీర్, బీసీసెల్ రాష్ట్రకార్యదర్శి జెరిపిటి అంజనప్ప, ఐటీడీపీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు పొగాకు షాన్వాజ్, మండలకన్వీనర్ జయచంద్ర, సాంబశివారెడ్డి, అంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'పది రోజుల్లో కులగణన ఎలా సాధ్యం ?'

కదిరి అర్బన్, జనవరి 20: రాష్ట్ర ప్రభుత్వం పది రోజుల్లోగా బీసీల కులగణన ఎలా చేపడుతుందని బీసీ సంఘాల నాయకులు ప్రశ్నించారు. పట్టణంలో శనివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటినుంచి నేటివరకు బీసీల కులగణన జరగలేదని అన్నారు. బీహార్ రాష్ట్రంలో కులగణనకు ఆరునెలలు సమయం పట్టిందన్నారు. అయితే మన రాష్ట్రంలో మాత్రం కేవలం పదిరోజులు మాత్రమే సమయం ఇచ్చారన్నారు. అతి తక్కువ సమయంలో ఎలా కులగణన చేస్తారని ప్రశ్నించారు. బీసీల జనాభా లెక్కల్ని నిబద్ధతతో తేల్చాలని అన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు కేఆర్ హరిప్రసాద్, సంపంగి గోవర్ధన్, సైదాపురం రమణ, డాబా గంగయ్య, నరసింహులు, నాగార్జున, కుమార్‌బాబు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నియామకం

కదిరిఅర్బన్, జనవరి 20: జాతీయ నాయిబ్రాహ్మణ సవితా సమాజం రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా తనను నియమించినట్లు పట్టణానికి చెందిన నరేష్ తెలిపారు. ఈమేరకు శనివారం వ్యవస్థాపక అధ్యక్షుడు గుండుపల్లి నాగేశ్వరరావునుంచి నియామక పత్రం అందుకున్నట్లు చెప్పారు. నాయీ బ్రాహ్మణుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన ప్రతి ఒకరికీ కృతజ్ఞతలు తెలిపారు.

కోకన్వీనర్‌గా అమర్‌కార్తికేయ

తనకల్లు, జనవరి 20: మండలంలోని బాలసముద్రం గ్రామ ఎంపీటీసీ సభ్యుడు అమర్‌కార్తికేయ జనసేన పార్టీ రాయలసీమ జోన్-2 కోకన్వీనర్‌గా శనివారం నియమితులయ్యారు. జనసేన రాయలసీమ జిల్లాల్లో ఎన్నికల నిర్వహణ కోసం కమిటీలను ఏర్పాటు చేసింది. అందులో భాగంగా ఎంపీటీసీ సభ్యుడు అమర్‌కార్తికేయను కో కన్వీనర్‌గా నియమించారు. రాయలసీమ జిల్లాల్లో జనసేనపార్టీ నుంచి ఎంపీటీసీగా గెలుపొందిన ఏకైక అభ్యర్థిగా అమర్‌కార్తికేయ గుర్తింపు పొందారు. తన నియామకానికి సహకారం అందించిన జనసేన నాయకులకు ఆయన కృజ్ఞతలు తెలిపారు. టీడీపీతో కలిసి పనిచేసి విజయానికి కృషిచేస్తామని పేర్కొన్నారు.

కమిటీ సభ్యుడిగా గుంటుపల్లి శంకర్..

పుట్టపర్తిరూరల్: జనసేన రాయలసీమజోన్-2 కమిటీలో జిల్లాకు చెందిన గుంటుపల్లి శంకర్‌కు చోటు లభించింది. ఈ మేరకు ఆ పార్టీ పొలిటికల్ రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ పాల్గొనే కార్యక్రమాలను విజయవంతం చేయడంలో భాగంగా ఓడీసీ మండలం ఆకుతోటపల్లికి చెందిన గుంటుపల్లి శంకర్‌ను రాయలసీమ జోన్-2లో కమిటీ సభ్యుడుగా నియమించినట్లు రాష్ట్ర కార్యదర్శి తెలియజేశారు.

అన్ని మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలి

కదిరి అర్బన్, జనవరి 20: జిల్లాలోని అన్ని మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమార్‌స్వామి, బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. రైతులను ఆదుకోవడంతో రాష్ట్రప్రభుత్వం విఫలమైందన్నారు. కరువుతో విలవిల్లాడుతున్న రైతులను మరింత అప్పుల్లోకి నెట్టేలా ఈ ప్రభుత్వ చర్యలు ఉన్నాయన్నారు. జిల్లా వ్యాప్తంగా కరువు ఉంటే.. కేవలం కొన్ని మండలాలను మాత్రమే కరువు ప్రాంతాలుగా ప్రకటించడం ఏమిటని ప్రశ్నించారు. ప్రకటించిన మండలాల్లో కూడా సహాయకచర్యలు చేపట్టలేదన్నారు. ప్రతిపక్ష హోదాలో జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర చేసిన సమయంలో హంద్రీనీవా ద్వారా అన్నిచెరువులకు నీరందిస్తామని హామీ ఇచ్చారని, అయితే అధికారం చేపట్టి ఐదేళ్లు పూర్తి అవుతున్నా.. ఏచెరువుకు కూడా నీరు నింపిన దాఖలాలు లేవని దుయ్యబట్టారు. ఇప్పటికైనా రైతుల సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎంఎస్ పార్థసారథి, తలుపుల గంగాధర్, వేణుగోపాల్‌రెడ్డి, చంద్రశేఖర్, వెంకటేష్ రామమోహన్, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు

వైసీపీ పాలనలో.. అన్నీ కష్టాలే

● గ్రామాల్లో శ్మశానవాటికలు కూడా ఏర్పాటు చేయలేదు

● టీడీపీ అధికారంలోకి రాగానే సమస్యలన్నీ పరిష్కరిస్తా

● భవిష్యత్తుకు గ్యారెంటీలో ప్రజలకు పరిటాలశ్రీరామ్ భరోసా



మరువపల్లిలో కరపత్రాలను ప్రజలకు అందజేసిన పరిటాలశ్రీరామ్

తాడిమర్రి, జనవరి 20: వైసీపీ పాలనలో ప్రజలకు అన్నీ కష్టాలే ఎదురవుతున్నాయని, కనీస సౌకర్యాలు లేక పడరాని పాట్లు పడుతున్నారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాలశ్రీరామ్ అన్నారు. చాలా గ్రామాల్లో శ్మశాన వాటికలు కూడా ఏర్పాటుచేయలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉందని విమర్శించారు. మండలంలోని మరువపల్లి, శివంపల్లి గ్రామాలలో శనివారం టీడీపీ శ్రేణులు బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో పరిటాల శ్రీరామ్ పాల్గొని వారితో కలిసి ఇంటింటికీ తిరిగి ప్రజలకు కరపత్రాలు అందజేసి మినీమేనిఫెస్టో పథకాల గురించి వివరించారు. ఇంట్లో ఎవరెవరికి ఏయే పథకం కింద ఏ మేరకు లబ్ధి చేకూరుతుందో వివరించారు. చంద్రబాబు సీఎం అయితే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని చెప్పారు. తర్వాత రెండు గ్రామాల్లోనూ ప్రజలు వివిధ సమస్యల్ని ఆయన దృష్టికి తెచ్చారు. మరువపల్లిలో శ్మశానవాటిక లేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. ఎవరైన చనిపోతే పూడ్చేందుకు కూడా సరైనవసతి లేదన్నారు. శివంపల్లిలో తాగునీటి సమస్య ఉందని తెలిపారు. ఇందుకు శ్రీరామ్ మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో అన్ని వర్గాల వారు ఏదో రకంగా ఇబ్బందులు పడుతూనే ఉన్నారన్నారు. గ్రామాలలో కనీస వసతులైన తాగునీరు, సీసీరోడ్లు,డ్రైనేజీలు, శ్మశాన వాటికలు లాంటి వాటిని కూడా ఈ ప్రభుత్వం ఏర్పాటు చేయలేకపోయిందని దుయ్యబట్టారు. టీడీపీ అధికారంలోకి రాగానే సమస్యలన్నింటినీ తప్పక పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తొలుత గ్రామాలలో తెలుగుతమ్ముళ్లు పరిటాలశ్రీరామ్‌కు పూలమాలలు, గజమాలతో ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కూచిరామ్మోహన్, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు గోనుగుంట్లభూషణ్, టీఎన్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ముంటిమడుగు హర్ష, నాయకులు రామానాయుడు, రవీంద్రరెడ్డి, పక్కీర్‌రెడ్డి, ఆత్మకూరు శ్రీనివాసులు, మాజీ ఎంపీపీలు, మాజీసర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

40వ రోజుకు చేరిన నిరవధిక సమ్మె

● పలు చోట్ల ధర్నా చేపట్టిన అంగన్‌వాడీలు

● మద్దతు తెలిపిన సీఐటీయూ నాయకులు



ఓడీసీలో మండుటెండలో రోడ్డుపై బైఠాయించిన అంగన్‌వాడీలు

ధర్మవరం, జనవరి 20: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం నాటికి 40వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట వారు ధర్నా చేపట్టారు. వారికి రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, సీఐటీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఆదినారాయణ, అయూబ్‌ఖాన్ మద్దతు తెలిపి మాట్లాడారు. రోజుల తరబడి అంగన్‌వాడీలు సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వానికి చీమ కుట్టినట్టుగా కూడా లేదన్నారు. ఇంత మొండి ప్రభుత్వాన్ని ఇంత వరకు ఎక్కడా చూడలేదన్నారు. పైపెచ్చు అంగన్‌వాడీలపై కక్షసాదింపుచర్యలకు యత్నించడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీల సమస్యల్ని వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

నంబులపూలకుంట: మండలకేంద్రంలోని బస్ షెల్టర్ వద్ద అంగన్‌వాడీలు సమ్మె కొనసాగించారు. వీరి సమ్మెకు సీఐటీయూ నాయకులు జీఎల్ నరసింహులు, జగన్‌మోహన్ మద్దతు తెలిపారు.

ఓబుళదేవరచెరువు: మండలంలోని మహమ్మదాబాద్ క్రాస్‌లో గల సీడీపీఓ కార్యాలయం ఎదుట నడిరోడ్డుపై అంగన్‌వాడీలు బైఠాయించి ధర్నా చేశారు. మండుటెండలోనే కూర్చొని రెండు చేతులతో సీఎంకు దండం పెడుతూ నిరసన తెలిపారు. పలువురు మాట్లాడుతూ.. సీఎం సారూ.. దండం పెట్టి అడుగుతున్నాం తమ సమస్యల్ని పరిష్కరించాలని కోరారు. వీరికి సీఐటీయూ నాయకులు మద్దతు పలికారు. కార్యకర్తలు, ఆయాలు ఎండను తాళలేక చీర కొంగును తలపై వేసుకుని మరీ ధర్నా చేపట్టారు.



ధర్మవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా..



నంబులపూలకుంటలో సమ్మె ..

శివారు కాలనీల్లో తాగునీటి సమస్య తీర్చండి

● మున్సిపల్ కమిషనర్‌కు టీడీపీ నాయకుల వినతి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

ధర్మవరం, జనవరి 20: వేసవి రాక ముందే ధర్మవరం పట్టణంలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొందని, తక్షణమే శివారు కాలనీలకు తాగునీటిని సరఫరా చేసి ప్రజల దాహార్తిని తీర్చాలని టీడీపీ నాయకులు మున్సిపల్ కమిషనర్ బండిశేషన్నకు వినతిపత్రం అందజేశారు. కమిషనర్‌ను శనివారం వారు కలిసి శివారుకాలనీలలో నెలకొన్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ ఇందిరమ్మకాలనీ, ఎల్-3 కాలనీలలో కొందరు ప్రైవేటు వ్యక్తులు సొంతంగా మేమే పైపులైన్లు వేసి నీటిని సరఫరా చేస్తున్నామని, కావున ఒక్కొక్క కొళాయి కనెక్షన్‌కు రూ.5వేలు ఇవ్వాలని, లేకుంటే కొళాయి కనెక్షన్ కట్ చేస్తామని బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నట్టు ఆయా కాలనీ వాసులు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పరిటాలశ్రీరామ్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. కావున తక్షణమే తాగునీటి సరఫరాలో ప్రైవేటు వ్యక్తుల జోక్యం పూర్తిస్థాయిలో తగ్గించాలని, డబ్బులు వసూలు చేసిన వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కమిషనర్‌ను కోరారు. తాగునీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలలో ఓవర్‌హెడ్‌ట్యాంక్‌లను వెంటనే నిర్మించి పైపులైన్‌లు వేయాలన్నారు. కమిషనర్‌ను కలిసిన వారిలో నాయకులు ఫణికుమార్, పరిశేసుధాకర్, పురుషోత్తంగౌడ్, నాగూర్‌హుస్సేన్, మాధవరెడ్డి, కేశగాళ్లశీన, మారుతీస్వామి, గోసలశ్రీరాములు,ఓంకార్,పల్లపు శంకర్, ఇర్షాద్, నాగేంద్ర, ఆనందరెడ్డి పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి పల్లె పరామర్శ

పుట్టపర్తి రూరల్, జనవరి 20: మండలంలోని ఎగువగంగిరెడ్డిపల్లిలో టీడీపీ కార్యకర్త పూలరామాంజి సతీమణి పూల అరుణమ్మ అనారోగ్యంతో శనివారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి గ్రామానికి వెళ్లి ఆమె భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం చేశారు. పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. పల్లె వెంట కన్వీనర్ విజయ్‌కుమార్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు శ్రీరామిరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా ప్రధానకార్యదర్శి రామాంజనేయులు, నాయకులు గంగాధర్‌నాయుడు, వెంకటరెడ్డి, పూల వెంకటేసు ఉన్నారు.

అయోధ్య అక్షింతలు పంపిణీ

అమడగూరు, జనవరి 20: అయోధ్య రాముడి అక్షింతలకు మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం బీజేపీ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి వాటిని పంపిణీ చేశారు. పలువురు మాట్లాడుతూ.. ఈ నెల 22వ తేదీన అయోధ్యలో రాముడి విగ్రహ ప్రతిష్ఠ జరగనుందని, ఆ రోజున ప్రజలు తమతమ ఇళ్లల్లోని రాముడి చిత్రపటానికి పూలు, అక్షింతలు వేసి, దీపాలు వెలిగించి పూజలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు , స్థానికులు పాల్గొన్నారు.

యువకుడిపై అకారణంగా చేయి చేసుకున్నారు..

● పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి అనుచరుడిపై గ్రామస్థుల మండిపాటు

కదిరి, జనవరి 20: పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పాదయాత్ర శనివారం ఓబుళదేవరచెరువు మండలం వెంకటాపురం గ్రామంలో కొనసాగింది. అయితే అక్కడ 4వ తరగతి చదువుతున్న ఓ బాలుడు మిద్దెపై టీడీపీ జెండా చేతపట్టుకుని అటుఇటూ ఊపుతూ ఆడుకుంటున్నాడు. ఆ దృశ్యాన్ని కింద నుంచి అంజన్‌రెడ్డి అనే యువకుడు సెల్‌ఫోన్‌లో వీడియో తీస్తున్నాడు. అయితే దీన్ని గమనించిన ఎమ్మెల్యే అనుచరుల్లో ఒకరు ఆ యువకుడిని ఎందుకు వీడియో తీస్తున్నావంటూ చేయి చేసుకున్నట్లు తెలిసింది. అనంతరం సెల్‌ఫోన్‌తో సహా ఆ యువకుడిని పోలీసులకు అప్పగించినట్లు సమాచారం. దీనిపై పోలీసులను వివరణ అడగ్గా అలాంటిది ఏమీ లేదని కొట్టిపారేశారు. కాగా అకారణంగా యువకుడిపై ఎమ్మెల్యే అనుచరులు చేయి చేసుకోవడంపై గ్రామస్థులు మండిపడుతున్నారు.

'జగన్‌ను అంబేడ్కర్‌తో పోల్చడం సిగ్గుచేటు'



ధర్మవరంలో విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ ఎస్సీసెల్ నాయకులు

ధర్మవరం, జనవరి 20: ముఖ్యమంత్రి జగన్‌ను మంత్రులు బీఆర్ అంబేడ్కర్‌తో పోల్చడం సిగ్గుచేట ని టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కేశగాళ్లశ్రీనివాసులు పేర్కొన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విజయవాడలో అంబేడ్కర్‌విగ్రహ ఆవిష్కరణను స్వాగతిస్తున్నామన్నారు. అయితే సీఎం జగన్ నాలుగున్నరేళ్లపాలనలో దళితుల అభ్యున్నతికి ఏమి చేశారో చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. గత టీడీపీ ప్రభుత్వం దళితులకు అనేక సంక్షేమపథకాలు వర్తింపజేసిందని, అయితే వైసీపీ అధికారంలోకి రాగానే ఆ పథకాలన్నీ రద్దు చేసిందని వాపోయారు. ఎస్సీల పైనే ఎస్సీ, ఎస్టీకేసులు బనాయించిన ఘనత జగన్‌దేనన్నారు. టీడీపీ హయాంలో విదేశాలలో ఉన్నత విద్యకోసం రూ.15లక్షలు అందిస్తే .. జగన్ ఒక పైసా కూడా ఇవ్వలేదని దుయ్యబట్టారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్సీసెల్ నాయకులు మొండిశీన, పోట్లమర్రి ఆనంద్, బడన్నపల్లి ఆది, పోతలయ్య, లక్ష్మీనారాయణ, సుబ్రమణ్యం, బద్రి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని తాకే అర్హత జగన్‌కి లేదు

బత్తలపల్లి: దళితులకు సంబంధించిన సంక్షేమ పథకాలన్నింటినీ రద్దు చేసిన సీఎం జగన్‌కి బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని తాకే అర్హత లేదని టీడీపీ ఎస్సీ సెల్ ధర్మవరం నియోజకవర్గ అధ్యక్షుడు నారాయణస్వామి తెలిపారు. మండలకేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు 6వేల మంది దళితులపై దాడులు జరిగాయని తెలిపారు. 188 మంది దళితులు హత్యకు గురయ్యారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో దళితులకు విదేశీ విద్య అదిందన్నారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా 4లక్షల మంది దళితులకు ఉపాధి అవకాశాలు లభించాయన్నారు. 7748మంది దళితులకు ఇన్నోవా కార్లను సబ్సిడీతో అందించారన్నారు. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అవన్నీ నిలిచిపోయాయని వాపోయారు. సీఎం జగన్ దళితుల ద్రోహిగా చరిత్రలో నిలిచి పోయారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఆనంద్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఒంటరి జీవితం భరించలేక..

● యువకుడి ఆత్మహత్య



సుబ్రమణ్యం(ఫైల్)

ధర్మవరం, జనవరి 20: ఒంటరి జీవితం భరించలేక తీవ్ర మనస్థాపానికి గురైన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. ఘటనపై టూటౌన్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని రాంగ నగర్ చెందిన సుబ్ర మణ్యం(20) అనే యువకుడి తల్లిదండ్రులు రామాంజనేయులు, రత్నమ్మ మూడేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. అప్పటి నుంచి అతడు తన అన్న దామోదర్ కలిసి ఉండేవారు. అయితే కొన్నాళ్లకు సోదరుడు కూడా అప్పుల బాధ తాళలేక ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో ఒంటరి జీవితం భరించలేక సుబ్రమణ్యం తీవ్ర మనస్థాపానికి గురూ శనివారం ఇంటిలో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. చుట్టు పక్కల వారు గమనించి అతన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. బంధువులు ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. మృతుడికి వివాహం కాలేదు.

తండ్రిపై అలిగి మరొకరు..

నల్లచెరువు: మండలంలోని కుమ్మరవాండ్లపల్లి గ్రామంలో శనివారం ఓ యువకుడు ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. ఎస్ఐ లింగప్ప తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. కుమ్మరవాండ్లపల్లికి చెందిన యల్లప్పకు ఇద్దరు కుమారులు. అందులో పెద్దకుమారుడు ఆర్మీలో ఉన్నాడు. చిన్నకుమారుడు లోకేష్ (21) ఖాళీగానే ఉంటూ.. అప్పుడప్పుడు ఆటో నడిపేవాడు. కాగా లోకేష్ ఇటీవల పొలంలో బోరు వేయించాలని తన తండ్రిని అడిగాడు. తండ్రి అందుకు ఒప్పుకోలేదు. దీంతో అతను తిండితిప్పలు మానేసి అలిగాడు. అయినా అతడి తండ్రి ఒప్పుకోకపోవడంతో మనస్థాపానికి గురై శనివారం తెల్లవారుజామున పాత మిద్దెలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

జయహో బీసీ సదస్సుకు తరలిరండి

కొత్తచెరువు, జనవరి 20: మండలకేంద్రంలో ఆదివారం మాజీ మంత్రి పల్లెరఘునాథ రెడ్డి ఆధ్వర్యంలో జయహో బీసీ సదస్సు జరగనుందని, మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, బీసీ నాయకులు తరలివచ్చి విజయవంతం చేయాలని పార్టీ మండల కన్వీనర్ అడపాల రామకృష్ణ, బీసీ సెల్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు బండ్లపల్లి రాజు, వడ్డెర్లసంఘం నియోజవకర్గ అధ్యక్షుడు ఒలిపి శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు మొదట నారేపల్లి గ్రామంలో బైకు ర్యాలీ ప్రారంభవుతుందన్నారు. అక్కడ నుంచి మైలసముద్రం, కేశాపురం, కొడపగానిపల్లి, మైలేపల్లి, లింగారెడ్డి పల్లి, నాగిరెడ్డిపల్లి, ఇరగంపల్లి, తలమర్ల, మరుకుంటపల్లి, పోతుల కుంట, అప్పలవాండ్ల పల్లి, భైరాపురం, లోచర్ల, కొత్తచెరువు వరకు కొన సాగుతుందన్నారు. అనంతరం మండల కేంద్రంలోని శ్రీవిద్య కల్యాణ మండపంలో సదస్సు జరుగుతుందన్నారు. మండలంలోని బీసీ సంఘం నాయకులు తరలి రావాలని వారు కోరారు.

మహిళ హత్య కేసులో నిందితుడి అరెస్టు

ముదిగుబ్బ, జనవరి 20: మండలంలోని దొరిగల్లు అటవీ ప్రాంతంలో ఇటీవల జరిగిన మహిళ హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో సీఐ యతీంద్ర శనివారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. అనంతపురం జిల్లా కేంద్రంలోని రాంనగర్‌కు చెందిన లక్ష్మీదేవిని దొరిగల్లు అటవీ ప్రాంతంలో ఈ నెల 16వ తేదీన అనంతపురానికే చెందిన ఆదినారాయణ హత్య చేశాడన్నారు. ఆదినారాయణతో లక్ష్మీదేవి రూ.5 లక్షలు అప్పు తీసుకుని వడ్డీ వ్యాపారం, చీటీలు నడిపేదన్నారు. వారి పరిచయం వివాహేతర సంబంధంగా ఏర్పడడంతో.. దొరిగల్లు అటవీ ప్రాంతంలోకి అప్పుడప్పుడు వస్తూ, మద్యం సేవించి వెళ్తుండేవారన్నారు. కాగా లక్ష్మీదేవితో అనంతపురానికి చెందిన మరో వ్యక్తితో పరిచయం ఏర్పడిందని, వారిరువురూ సన్నిహితంగా ఉండడం చూసిన ఆదినారాయణ లక్ష్మీదేవి పై కక్ష పెంచుకున్నాడని తెలిపారు.ఎలాగైనా ఆమెను కడతేర్చాలని పథకం పన్నాడన్నారు. ఈక్రమంలో లక్ష్మీదేవికి మాయమాటలు చెప్పి ఈ నెల 16న మధ్యాహ్నం స్కూటీపై దొరిగల్లు ఘాట్ రోడ్డు పక్కన అటవీ ప్రాంతంలోకి వచ్చారన్నారు. అక్కడ ఇద్దరూ మద్యం సేవించారన్నారు. ఆమెకు మత్తు ఎక్కువ కావడంతో ఆదినారాయణ ఆమె చీరతోనే మెడకు బిగించి హత్య చేశాడన్నారు. మృతురాలి కుమార్తె ఫిర్యాదు మేరకుకేసు నమోదు చేసి దర్యాప్తు చేశామన్నారు. శనివారం ఉదయం రాళ్లనంతపురం క్రాస్ వద్ద ఆదినారాయణను అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు తెలిపారు. ఎస్ఐ వంశీకృష్ణ పాల్గొన్నారు.

దివ్యాంగురాలికి నిత్యావసరాల పంపిణీ

కొత్తచెరువు, జనవరి 20: మండల కేంద్రంలోని గాంధీనగర్ కాలనీలో నివాసముంటున్న దివ్యాంగురాలు మల్లేశ్వరమ్మకు బాలాజీ దివ్యాంగుల సంఘం సభ్యులు నిత్యావసర సరుకులను శనివారం పంపిణీ చేశారు. ఆమె దీన స్థితిని గమనించిన ఆ సంఘం సభ్యులు నిత్యావసర వస్తువులను అందించి.. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

నేడు వేమన చిత్ర పటం ఊరేగింపు

హిందూపురం అర్బన్, జనవరి 20: పట్టణంలో ఆదివారం యోగి వేమన చిత్రపటంతో గొప్ప ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు, రెడ్డి జేఏసీ నాయకులు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. యోగి వేమన జయంతి వేడుకలను పురస్కరించుకొని వేమన రాసిన పద్యాల్లోని నిగూఢ పరమార్థం ప్రజలకు తెలియజేయడమే ముఖ్య ఉద్దేశమన్నారు. ఉదయ 9 గంటలకు మేళాపురం తెలుగుతల్లి విగ్రహం వద్ద నుంచి బసవనపల్లి యోగి వేమన విగ్రహం వరకు ర్యాలీ ఉంటుందన్నారు. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని వారు కోరారు.

26న ఉచిత వైద్యశిబిరం

గోరంట్ల, జనవరి 20: పట్టణంలోని షాదీమహల్‌లో ఈనెల 26న ఉచితవైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు టీడీపీ మైనార్టీ యువనాయకుడు, సామాజిక సేవాకార్యకర్త ఉమ్మర్‌ఖాన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బెంగుళూరుకు చెందిన సప్తగిరి ఆసుపత్రి వైద్యులచే శిబిరంలో గుండె, నరాలు, కిడ్నీలు, క్యాన్సర్ వ్యాధులకు ఉచితంగా పరీక్షలతోపాటు మందులు అందిస్తామ న్నారు. చికిత్సలు పొందేవారు తమ పాత మెడికల్ రిపోర్టులు, ఆధార్, ఆరోగ్యశ్రీకార్డు తీసుకురా వాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

టీడీపీ నాయకుడికి సవిత పరామర్శ


రంగనాయకులును పరామర్శిస్తున్న సవిత

గోరంట్ల, జనవరి 20: మండలంలోని గౌనివారి పల్లికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు రంగనాయకులు అనారోగ్యానికి గురికాగా, ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత శనివారం పరామర్శించారు. తీవ్ర అనారోగ్యంతో బెంగుళూరులోని ఎంఎస్ రామయ్య ఆసుపత్రిలో రంగనాయ కులు చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న సవిత అక్కడికెళ్లి రంగనాయకులను పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ పార్టీ అన్నివేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చినట్లు స్థానిక నాయకులు తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

గోరంట్ల, జనవరి 20: మండలంలోని బూదిలి తండా వద్ద కారులో తరలిస్తున్న 960 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యాన్ని శనివారం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు అక్రమంగా మద్యం తరలింపును నియంత్రించేందుకు ఏర్పాటు చేసిన స్థానిక చెక్‌పోస్టు సిబ్బంది గస్తీ తిరుగుతుండగా తెల్లవారుజామున 4గంటల సమయంలో బూదిలి తండా వద్ద కేఏ 05ఎంబీ 3306 నెంబర్‌గల కారు పట్టుబడిందన్నారు. కారులోని గుర్తు తెలియని వ్యక్తి పోలీసులను చూసి కారును, మద్యాన్ని వదిలి పారిపోయాడని సీఐ తెలిపారు. అందులో పది బాక్సుల్లో ఉన్న 960 ప్యాకెట్ల కర్ణాటక మద్యాన్ని గుర్తించామన్నారు. కారును, మద్యాన్ని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

గోరంట్ల, జనవరి 20: మండలంలోని పాలసముద్రం గ్రామంలో నేసే నరసింహులు (34) అనే వ్యక్తి జీవితంపై విరక్తి చెంది తన ఇంట్లోనే పైకప్పునకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు శనివారం గుర్తించామని సీఐ సుబ్బరాయుడు తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు... నారసింపలికి చెందిన నారాయణప్ప కుమారుడు నేసే నరసింహులు కుటుంబ సభ్యులు గత కొన్నేళ్లుగా పాలసముద్రంలో ఉంటున్నారు. తల్లి చీరల వ్యాపారం చేస్తుండగా, భార్య వ్యవసాయ పనులకు వెళ్తేది. నరసింహులుకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. అయినా అతడు బాధ్యతగా ప్రవర్తించకుండా మద్యానికి బానిసై తిరిగేవాడు, ఇలా ఉండగా, ఇటీవల రోడ్డు ప్రమాదం జరిగి మరింత అస్వస్థతకు గురయ్యాడు. మానసిక పరిస్థితి సరిగా లేదు. దీంతో జీవితంపై విరక్తి చెందిన నరసింహులు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి, శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ఆసుపత్రికి తరలించామని సీఐ తెలిపారు.

మట్కా బీటర్ల అరెస్ట్

రూ.1,02,400 స్వాధీనం

గుడిబండ, జనవరి 20 : మండలంలోని చిగతుర్తి గ్రామానికి చెందిన ఇద్దరు మట్కా బీటర్లను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ మునిప్రతాప్ తెలిపారు. ఇద్దరు వ్యక్తులు మండలంలోని నాగేపల్లి ప్రధాన రహదారి పక్కన మట్కా పట్టీలను రాస్తున్న సమయంలో పట్టుకుని రూ.1,02,400 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిపై కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ దాడుల్లో కానిస్టేబుళ్లు మహ్మద్ రఫీక్, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ బోరు కేబుల్ చోరీ


వ్యవసాయ బోరు కేబుల్, స్టార్టర్ ఎత్తుకెళ్లిన దృశ్యం

మడకశిర రూరల్, జనవరి 20: పట్టణ సమీపంలోని తన వ్యవసాయ బోరుకు అమర్చిన స్టార్టరు, కేబుల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు రైతు రవికుమార్ తెలిపారు ఈ విషయమై శుక్రవారం ఎస్ఐ లోకేశ్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మడకశిర పట్టణానికి సమీపంలోని వడ్రపాళ్యం గ్రామానికి చెందిన బాధిత రైతు రవికుమార్ మాట్లాడుతూ ... ఇటీవల వ్యవసాయ బోర్లకు అమర్చిన స్టార్టర్లు, కేబుల్‌ను లక్ష్యంగా పెట్టుకుని దొంగలు వాటిని తీసుకెళ్తున్నట్లు తెలిపారు. దీంతో రైతులు పంట పొలాలకు నీరు పెట్టేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా మడకశిర మండలంలోని కదిరేపల్లి, గుండుమల, మెళవాయి, గుర్రపుకొండ, సిద్ధగిరి తదితర గ్రామాల్లో నెల రోజుల వ్యవధిలోనే 36 వ్యవసాయ బోర్లుకు సంబంధించిన కేబుల్, స్టార్టర్లను దొంగలు ఎత్తుకెళ్లినట్లు బాధిత రైతులు లబోదిబోమంటున్నారు. బోర్ల వద్ద కేబుల్, స్టార్టర్ల చోరీలపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచి తగు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు.


చిలమత్తూరులో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు


మడకశిర: నిరసనలో పాల్గొన్న అంగన్‌వాడీలు

డిమాండ్లు నెరవేర్చే వరకు సమ్మె ఆగదు

తేల్చిచెప్పిన అంగన్‌వాడీలు - సమ్మె కొనసాగింపు

(ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్)

ప్రభుత్వం దిగివచ్చి తాము కోరుతున్న న్యాయపరమైన డిమాండ్లను నెరవేర్చే వరకు సమ్మె కొనసాగుతుందని అంగన్‌వాడీలు పేర్కొన్నారు. సమ్మెలో భాగంగా శనివారం చిలమత్తూరు మండల కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయా లు రిలే దీక్షలకు పూనుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమతో వెట్టిచాకిరీ చేయించుకునే ప్రభుత్వం కనీసం తమ డిమాండ్లను పూర్తిగా వినడానికి కూడా సమయం కేటాయించడం లేదన్నారు. చర్చలు సైతం వారు చెప్పిన వాటినే ఒప్పుకుంటేనే అనే విధంగా సాగాయన్నారు. తాము కోరుతున్న న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరిస్తేనే సమ్మె విరమిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు శోభారాణి, శారద, పుణ్యవతి, రామతులసి, పద్మావతి, వనజ తదితరలు పాల్గొన్నారు. అలాగే మడకశిర సీడీపీఓ కార్యాలయం ఆవరణంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. వారు 40 రోజులుగా వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ప్రభుత్వం ఎస్మా ప్రయోగిస్తూ జీఓ విడుదల చేసినా తమ సమస్యలు పరిష్కరించినప్పుడే సమ్మె విరమిస్తామన్నారు. అగళిలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం అంగనవాడీల సమస్యలు పరిష్కరించేది ఎప్పుడోనని వాపోయారు. ఇప్పటికైనా తమ సమస్యలు పరిష్కరించాలని డిమాడ్ చేశారు. గుడిబండ ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట అంగనవాడీల ధర్నా కొనసాగింది. పెద్దఎత్తున తరలి వచ్చి నిరసన చేపట్టారు. అదేవిధంగా హిందూపురం, రొద్దం, సోమందేపల్లి, గోరంట్ల, లేపాక్షి తదితర చోట్ల అంగన్‌వాడీల నిరసన కార్యక్రమాలు కొనసాగాయి.


అగళి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన

కార్మిక చట్టాలను సద్వినియోగం చేసుకోండి

జిల్లా అదనపు కోర్టు న్యాయాధికారి శైలజ

హిందూపురం, జనవరి 20 : కార్మిక చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు కోర్టు న్యాయాధికారి పల్లె శైలజ పేర్కొన్నారు. పట్టణంలోని ఆటోనగర్‌లో శనివారం కార్మిక చట్టాలపై జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సుకు న్యాయాధికారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ... కార్మికుల కోసం ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను సద్విని యోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి కార్మికుడు బీమా సౌకర్యం పొందాలని, అది భవిష్యత్తులో వారి కుటుంబాలకు తోడ్పాటు నందిస్తోందన్నారు. వాహనాలను నడిపేవారు తప్పనిసరిగా లైసె న్స్ పొందాలన్నారు. దీనివల్ల బీమా పథకాలు వినియోగించుకోవచ్చన్నారు. 14ఏళ్ల లోపు చిన్నారులను ఎట్టి పరిస్థితుల్లోనూ పనుల్లో పెట్టుకోరాదన్నారు. నిరుపేదలు ఉచిత న్యాయ సహాయం పొందాలన్నారు. సమాజంలో కార్మికుల పాత్ర విశేషమైందన్నారు. ఈ సందర్భంగా పలువురు వివిధ సమస్యలను న్యాయాధికారి దృష్టికి తీసుకెళ్లగా... సంబంధిత అధికారులకు తెలిపి పరిష్కరించేలా చూస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీపీ ఇందాద్, ఏజీపీ శ్రీనివాసరెడ్డి, న్యాయవాది సుదర్శన్, ఎస్ఐ కళావతి, కార్మికులు పాల్గొన్నారు.

స్థల వివాదం.. స్వల్ప ఘర్షణ

ఇరువర్గాలకు సర్దిచెప్పిన పోలీసులు


వివాదానికి దారితీసిన స్థలం ఇదే

హిందూపురం, జనవరి 20 : పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో ఓ స్థలం విషయంలో స్వల్ప ఘర్షణ నెలకొనగా, పోలీసులు రంగ ప్రవేశం చేసి సద్దుమణిగించారు. అందిన సమాచారం మేరకు... ఆ స్థలం విషయం కొద్దిరోజులుగా కోర్టులో జరుగుతోంది. అయితే పట్టణానికి చెందిన రియల్టర్ గా పేరుగాంచిన ఓ వ్యక్తి కొంతకాలం కిందట ఆ స్థలాన్ని కొనుగోలు చేశాడు. అదే స్థలానికి ఆనుకుని కొన్నేళ్ల కిందట ప్రభుత్వం పలువురికి ఇంటి పట్టాలు ఇచ్చింది. ఆ స్థలం కొనుగోలు చేసిన రియల్టర్ అధికార పార్టీకి అనుకూలం గా ఉన్నట్లు పలువురు అంటున్నారు. దీంతో అతడు శనివారం తెల్లవారుజామున ధర్మవరం ప్రాంతానికి చెందిన వ్యక్తులను మూడు వాహనాల్లో ఆ స్థలం వద్దకు తీసుకొచ్చాడు. అక్కడ పొలంలో ఉన్న రేకులషెడ్డును తొలగిస్తుండగా... ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటిపట్టా తీసుకున్న వ్యక్తి అడ్డుకునేందుకు ప్రయత్నించాడు. ఈ సందర్భంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. వన్‌టౌన్ సీఐ శ్రీనివాసులు అక్కడకు చేరుకుని నిబంధనల ప్రకారం సమస్య పరిష్కరించుకోవాలని ఇరువురికీ సూచించారు. కోర్టు ఆదేశాల మేరకు నడుచుకోవాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ స్థలాన్ని రెవెన్యూ అధికారులు వెళ్లి కొలతలువేశారు. ఇదిలా ఉంటే వివాదానికి దారితీసిన స్థలంలో మునిసిపాలిటీకి చెందిన స్థలం కూడా ఉన్నట్లు తెలిసింది.

పూజారులను ప్రభుత్వం ఆదుకోవాలి

పూజారుల సంక్షేమ సంఘం విన్నపం


పూజారుల సంఘం కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప

గోరంట్ల, జనవరి 20: జిల్లాలోని తెలుగు పూజారులను, గ్రామదేవతల పూజారులను ప్రభుత్వం ఆదుకుని నెలసరి వేతనాలు చెల్లించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. గోరంట్లలోని వాసవి మహల్‌లో జిల్లా తెలుగుపూజారుల సంక్షేమ సంఘం, ఆదిశక్తి పీఠం గ్రామ దేవతల పూజారులు శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, ప్రవాస భారతీయుడు కావూరి లక్ష్మీవరప్రసాద్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. లక్ష్మీవరప్రసాద్ మాట్లాడుతూ పూర్వం నుంచి గ్రామ దేవతలను ఆరాధించేవారని, తద్వారా దేశం సుభిక్షంగా ఉండేదన్నారు. అలాంటి పూజారులను ప్రభుత్వం విస్మరించిందని, వారి జీవనం కోసం వేతనాలు చెలించాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు పూజారుల సంఘంజిల్లా అధ్యక్షులు శివరాం, జిల్లాలోని పూజారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మాజీ మంత్రిని కలిసిన తెలుగు యువత నాయకుడు

హిందూపురం, జనవరి 20: తెలుగుదేశం పార్టీ ప్రొఫెషనల్ వింగ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితుడైన శివరాజ్‌కుమార్ శనివారం మాజీ మంత్రి పరిటాల సునీతను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పరిటాల సునీతతోపాటు యువ నాయకుడు పరిటాల శ్రీరామ్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పార్థసారథిని కలిసి బొకే అందజేసి కృతజ్ఞతలు తెలిపినట్లు ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీ అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానన్నారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో ప్రొఫెషనల్ వింగ్ బాగా పనిచేయాలని నాయకులు చెప్పినట్లు శివరాజుకుమార్ పేర్కొన్నారు.

టీడీపీ నాయకుడి మృతికి మాజీ ఎమ్మెల్యే సంతాపం



రంగధామప్ప భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న ఈరన్న

మడకశిర రూరల్, జనవరి 20: తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు రంగధామప్ప మృతి పార్టీకి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్న తెలిపారు. రంగధామప్ప కొంత కాలంగా అనారోగ్యంతో ఉంటూ శనివారం స్వగ్రామం ఆమిదాల గొందిలో మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఈరన్న ఆ గ్రామానికి వెళ్లి రంగధామప్ప భౌతిక కాయానికి పూల మాలు వేసి నివాళులర్పించారు. నాయకులు, కార్యకర్తలకు టీడీపీ ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. ఈరన్న వెంట మాజీ ఎంపీపీలు అశ్వత్థమప్ప,ఆదినారాయణ,మంజునాథ్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై తేనెటీగల దాడి

ఓ విద్యార్థిని ఆసుపత్రికి తీసుకెళ్తుండగా ఢీకొన్న లారీ

ఈ ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు చరణ్, ప్రవీణ్, గోపి, యువకుడు గిరీష్

హిందూపురం, జనవరి 20 : మండలంలోని చిన్నగుడ్డంపల్లి సమీపంలో శనివారం పొలాలవద్ద ఆడుకోవడానికి వెళ్లిన విద్యార్థులపై తేనెటీగలు దాడిచేశాయి. హిందూపురం మండలం చిన్నగుడ్డంపల్లికి చెందిన ఏడో తరగతి చదువుతున్న గోపి, ప్రవీణ్, ఆరో తరగతి చదువుతున్న చరణ్ పొలంవద్ద ఆడుకోవడానికి వెళ్లారు. ఈ సమయంలో తేనెటీగలు దాడిచేశాయి. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వారిని వెంటనే హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ క్రమంలో చరణ్ అనే విద్యార్థిని చిన్నగుడ్డంపల్లికి చెందిన గిరీష్ అనే యువకుడు ద్విచక్ర వాహనంలో హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్తుండగా కొట్నూరు కట్టపై లారీ ఢీకొంది. ఈ ఘటనలో గిరీష్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఇదే సందర్భంలో లారీ వెనుకు వస్తున్న కారు లారీని ఢీకొనడంతో ముందు భాగం పాక్షికంగా దెబ్బతిం ది. గాయపడ్డ గిరీష్‌ను, చరణ్‌ను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తేనెటీగలు దా డిచేసిన విద్యార్థులకు ఆసుపత్రిలో చికిత్సలందిస్తున్నారు. కట్టపై జరిగిన ప్రమాదం పై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


లారీ కింద ఇరుక్కున్న ద్విచక్ర వాహనం

కులగణనకు సర్వర్ సమస్య


మొరంపల్లిలో కులగణన నిర్వహిస్తున్న సిబ్బంది

చిలమత్తూరు, జనవరి 20: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కులగణన కార్యక్రమానికి సర్వర్ సమస్య ఎదురవుతోంది. కులగణన కోసం ప్రత్యేక రూపొందించిన యాప్ సరిగా పనిచేయకఈ కార్యక్రమాన్ని రెండో రోజు శనివారం నిర్వహించిన అధికారులు ఇబ్బందులు పడ్డారు. ఈ యాప్ ద్వారా ప్రతి కుటుంబం లోని సభ్యుల అన్ని వివరాలను స్థానిక వార్డు లేక గ్రామ వలంటీర్ లాగిన్‌లోనే నమోదు చేయాల్సి ఉంది. అనంతరం సచివాలయ ఉద్యోగి లాగిన్ కావాల్సి ఉంది. అయితే సర్వర్ సక్రమంగా పనిచేయని కారణంగా ఉద్యోగులు తంటాలు పడుతు న్నారు. సర్వర్ బాగా పనిచేస్తే ఒక్కో కుటుంబ వివరాలను 10 నుంచి 15 నిమిషాల్లో పూర్తి చేస్తున్నారు. అయితే సర్వర్ సమస్య వల్ల ఒక కుటుంబ వివరాలు సేకరించడానికే గంటల తరబడి సమయం పడుతోంది. దీంతో రెండో రోజు కులగణన సర్వే ఆశించిన స్థాయిలో జరగలేదని తెలుస్తోంది.

పెనుకొండ : కుల గణన సేకరణకు వచ్చిన సిబ్బందికి రెండో రోజు కూడా సర్వర్ మొరాయించడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మొబైల్‌లో యాప్ పనిచేయకపోవడంతో పట్టణంలో కులగణన శనివారం చేపట్టడానికి వచ్చిన సిబ్బంది గంటల కొద్దీ ఇబ్బందిపడాల్సిన పరిస్థితి వచ్చింది. సర్వర్ మొరాయించడం తో ఒక్కో ఇంటివద్ద గంటల తరబడి నిరీక్షించాల్సి రావడంతో ఆయా కుటుంబ సభ్యులు అసహనానికి లోనయ్యారు.

రేపు రామాలయంలో ప్రత్యేక పూజలు

గోరంట్ల, జనవరి 20: అయోధ్యలో బలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన జరుగుతున్న సందర్భంగా సోమవారం గోరంట్లలోని కోదండరామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు బ్రాహ్మణ సంక్షేమ సంఘం నాయకులు శనివారం తెలిపారు. సంఘం ఆధ్వర్యంలో ఉదయం 10గంటలకు మూలవిరాట్లకు అభిషేకం, సహస్ర నామార్చన చేస్తామన్నారు. హనుమాన్‌చాలీసా పారాయణ, భజనలు, మహా మంగళహారతి నిర్వహిస్తున్నట్లు సంఘం నాయకులు భాస్కర్‌తారానాథ్‌శర్మ, రెడ్డికేశవప్రసాద్, జీఎం సురేష్ ఓప్రకటనలో తెలిపారు. అదేరోజు సాయంత్రం సీతారాముల ఉత్సవ విగ్రహాలతో నగరోత్సవం నిర్వహిస్తున్నామని భక్తులు, పూజల్లో విరివిగా పాల్గొనాలన వారు కోరారు

తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడిగా శివకుమార్



మడకశిరటౌన్, జనవరి 20: మండలకేంద్రమైన అమరాపురానికి చెందిన శివకుమార్‌ను తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు శనివారం ఉత్తరు పార్టీ నాయకులు తెలిపారు. అమరాపురం మండలం అమరాపురం గ్రామానికి చెందిన శివకుమార్‌ను జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షులుగా ఎంపిక చేసినందుకు ఆపార్టీ నాయకులు ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర అధ్యక్షులు అచ్చన్నాయుడు సూచన మేరకు శివకుమార్‌ను నియమించినట్లు ఆపార్టీ నాయకులు తెలిపారు.

టీడీపీలో యువతకు ప్రాధాన్యం: గుండుమల

మడకశిరటౌన్: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలుగుదేశం పార్టీలో యువతకు ప్రాధాన్యత కల్పిస్తూ వారి భవితకు బాటలు వేస్తున్నారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి అన్నారు. ఆయన శనివారం సాయంత్రం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రానికి భవిష్యత్తు అన్నా రు. యువతకు ఉపాధి అవకాశాలు మెరుగు పర్చడంతో పాటు ప్రజలు అన్ని రంగాల్లో రాణించే విధంగా తోడ్పాటును అందిస్తారన్నారు. గతంలో సైతం నిరుద్యోగ భృతి అందించి యువతకు కొంత మేర తోడ్పాటును అందించారన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం యువత ముందుకు వచ్చి ప్రత్యేకంగా కృషి చేయాలని కోరారు. తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎంపికైన శివకుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

కేంద్రం పథకాలను సద్వినియోగం చేసుకోండి

బీజేపీ నాయకులు

రొద్దం, జనవరి 20: కేంద్ర ప్రభుత్వం అందించే వివిధ రకాల పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ నాయకులు కోరారు. వికసిత భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మండల పరిధిలోని బొక్సంపల్లి, తురకలాపట్నం గ్రామాల్లో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. కేంద్రం ప్రభుత్వం ద్వారా వివిధ శాఖల నుంచి వచ్చే సంక్షేమ పథకాల వల్ల లబ్ధిదారులకు లబ్ది చేకూరేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానమంత్రి ఉజ్వల యోజన కింద అర్హులైన మహిళలకు గ్యాస్ కనెక్షన్‌లను పంపిణీ చేశారు. ఆయుష్మాన్ భారత్ కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్ ఏపీఓ రషీద్ సీఎస్‌డీటీ పోతన్న, ప్రభుత్వ అధికారి భాగ్యలక్ష్మి, ఏపీజీబీ బ్యాంక్ అధికారి విశ్వనాథ్, ఏఓ ఆనంద్‌నాయక్, ఐసీడీఎస్ సీడీపీఓ శాంతలక్ష్మి, సూపర్‌వైజర్ సుజాత, బీజేపీ నాయకులు నీరుగంటి వేణుగోపాల్, గంగాధర్, ఆదిమూర్తి, రామక్రిష్ణ, రాజు, మనోహర్, ఆశ వర్కర్లు, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కేజీబీవీని తనిఖీ చేసిన డీఈఓ


పాఠశాలలో విద్యార్థులు, తల్లిదండ్రులతో సమీక్షిస్తున్న డీఈఓ మీనాక్షి

అగళి, జనవరి 20: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని డీఈఓ మీనాక్షి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. విద్యార్థుల హాజరు, విద్యా బోధన, ఉపాధ్యాయుల హాజరు, భోజన వసతి, పాఠశాలలో మౌలిక సదుపాయాలపై ఆరాతీశారు. నాడు - నేడు కింద జరుగుతున్న పనులపై ఎంఈఓ-2 చంద్రశేఖర్ నాయుడు, కస్తూర్బా ఎస్ఓ నాగరత్నమ్మతో చర్చించారు. అర్ధాంతరంగా ఆగిపోయిన నాడు - నేడు పనులపై సమీక్షించారు. అనంతరం రెండో దశలో ఆగిపోయిన నాడు - నేడు పనులను ప్రారంభించారు. 37మంది విద్యార్థులకు బైజూస్ ట్యాబులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పిల్లలను బాగా చదివించండి

పావగడ ఎమ్మెల్యే వెంకటేష్


విరుపసముద్రంలో జ్యోతి వెలిగించి సభ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పావగడ, జనవరి 20: తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆస్తి కంటే ముఖ్యంగా నాణ్యమైన విద్య అందించాలని పావగడ ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేష్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆయన శనివారం విరుపసముద్రం, దొమ్మతిమర్రి గ్రామ పంచాయతీలలో నిర్వహించిన జన సంపర్క సభలో ఆయన జ్యోతి వెలిగించి మాట్లాడారు. పావగడ తాలూకా వ్యాప్తంగా విద్య, ఆరోగ్య పరంగా తాము ఎంతో చేయూతనందించామన్నారు. దొమ్మతిమర్రి గ్రామంలో హైటెక్ బస్సు షెల్టర్‌తోపాటు ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రజల సమస్యలపై పీడీఓలు, రెవెన్యూ అధికారులు సానుకూలంగా స్పందించి పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వరద రాజు, ఈఓ జానకిరామ్, కాంగ్రెస్ రూరల్ బ్లాక్ అధ్యక్షుడు రామాంజనప్ప, ఆది నారాయణ, మహిళా అధ్యక్షురాలు ఉషారాణి, సీఐ సురేష్, ఎస్ఐ విజయ్‌కుమార్, సీడీపీఓ సునీత, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.